ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

# vaartha sandhya
# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 121 శనివారం 18 - 04 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 121 Saturday 18 - 04 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## రాజధాని పరిధిలో పురుషుల కంటే
# మహిళలే ఎక్కువ

- టాప్‌లో రంగారెడ్డి
- లింగ నిష్పత్తిలో రంగారెడ్డి జిల్లాదే అగ్రస్థానం
- మూడు జిల్లాల్లో మహిళల సంఖ్యే ఎక్కువ
- స్పష్టం చేసిన సామాజిక ఆర్థిక కుల సర్వే నివేదిక
- మేడ్చల్-మల్కాజిగిరిలో సగటు లింగ నిష్పత్తి 1066
- సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా గణాంకాలు
- మహానగరం హైదరాబాద్‌లో నెలకు కేవలం రూ.5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం మంది జీవనం
- వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 17 :**
తెలంగాణలో నగర, పట్టణ జనాభాలో లింగ నిష్పత్తి చాలా ముందంజలో ఉంది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా తాజాగా విడుదలైన తెలంగాణ అర్బన్ డెమోగ్రాఫిక్ టేబుల్స్ (2024) గణాంకాల ప్రకారం రాజధాని పరిధిలోని జిల్లాల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండటం ఇక్కడ విశేషం. జీహెచ్‌ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సామాజిక వర్గాల వారీగా లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, ప్రజల్లో అవగాహన, మారుతున్న సామాజిక దృక్పథానికి ఈ ఫలితాలే నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు.
**జీహెచ్‌ఎంసీలో :** జీహెచ్‌ఎంసీ పరిధిలో లింగనిష్పత్తి 1078గా ఉంది. అంటే ఇక్కడ ప్రతి 1000 మంది పురుషులకు 1078 - మిగతా 2 లో

## రాష్ట్రానికి రావాల్సిన
# పెండింగ్ నిధులపై చర్చ



- ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 17 :**
కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట - మిగతా 2 లో



2 లో

## దక్షిణాదికి అన్యాయం జరగదు..

- రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి
- డీలిమిటేషన్ విషయంపై ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్న కిషన్ రెడ్డి
- జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని వెల్లడి
- హైబ్రిడ్ ఫార్ములాను రేవంత్ చేత ఒవైసీ చెప్పించారని విమర్శ

# పాస్టర్ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు..

- రూ. 2.27 కోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీ నగదు పట్టివేత
- సోదాల్లో ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఇది హవాలాకు సంబంధించిన డబ్బుగా అనుమానిస్తున్న అధికారులు
- డబ్బు ఎక్కడిదో చెప్పలేక తడబడిన పాస్టర్ కుటుంబం



**వార్త సంధ్య, నరసాపురం , ఏప్రిల్ 17 :**
పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. నరసాపురం మండలం పీచుపాలెంకు చెందిన పాస్టర్ ఘంటా జాన్‌బాబూరావు నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించి, ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ డబ్బును సీజ్ చేసి, ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించారు. ఇటీవల పాస్టర్ అల్లుడు శాంసన్ హైదరాబాద్ నుంచి రూ. 50 లక్షల నగదు తీసుకురావడంతో పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన మామగారైన జాన్‌బాబూరావు ఇంట్లో తనిఖీలు చేపట్టగా, రూ. 500 నోట్ల కట్టల రూపంలో దాచి ఉంచిన ఈ భారీ మొత్తం బయటపడింది. - మిగతా 2 లో

## లోక్‌సభలో వీగిపోయిన
# రాజ్యాంగ సవరణ బిల్లు


- మిగిలిన రెండింటిని ఉపసంహరించుకున్న కేంద్రం
- లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ఓటింగ్
- బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయిన ఎన్డీఏ



**వార్త సంధ్య,, ఢిల్లీ, ఏప్రిల్ 17 :**
మహిళా రిజర్వేషన్ల అమలుకు ఉద్దేశించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. ఈ బిల్లు ఆమోదానికి 352మంది సభ్యుల మద్దతు అవసరం కాగా అనుకూలంగా 298 మంది వ్యతిరేకంగా 230 ఓట్లు పడ్డాయి. మొత్తం 528 మంది సభ్యులు ఓటేశారు. అధికార ఎన్డీయే మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేకపోవటంతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లు ఆమోదానికి 352మంది సభ్యుల మద్దతు అవసరం కాగా 298మంది మాత్రమే అనుకూలంగా ఓటు వేశారు. 54 ఓట్లు తక్కువగా వచ్చాయి. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయినందున డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు, కేంద్రపాలిత ప్రాంతాల బిల్లులను కేంద్రం - మిగతా 2 లో

## తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా?

- జగన్ పై గౌతు శిరీష ఫైర్
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై వైసీపీ నేతల విమర్శలు హాస్యాస్పదమన్న గౌతు శిరీష
- ఆస్తి కోసం తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన జగన్ మహిళా పక్షపాతి కాదని విమర్శలు
- వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డిని జగన్ ప్రభుత్వం కాపాడిందని ఆరోపణ
- అమరావతి మహిళలను వేధించిన చరిత్ర వైసీపీది అంటూ ఆగ్రహం



**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 17 :**
వైసీపీ నేతలు ఇప్పటివరకు విలన్లు అనుకుంటే, ఇప్పుడు వారు చేస్తున్న విమర్శలతో ఉత్త జోకర్లుగా నిరూపించుకుంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతుంటే, ఏపీలోని వైసీపీ నేతలు మాత్రం విషం చిమ్ముతున్నారని ఆమె మండిపడ్డారు. తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా? అంటూ జగన్ పై ధ్వజమెత్తారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జగన్ పాలనలో మహిళలపై అనేక అకృత్యాలు జరిగాయంటూ నిప్పులు చెరిగారు. "మాజీ మంత్రి - మిగతా 2 లో

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త
## హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

- హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్



2 లో



2 లో

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

- 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి
- యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్
- కుటుంబంతో కలిసి 25 రోజులపాటు విదేశీ పర్యటన
- పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం

## మహిళా బిల్లుకు
# టీడీపీ సంపూర్ణ మద్దతు



2 లో

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక బిల్లు కాదన్న లావు
- కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న లావు

## రానున్నది మరింత
# కఠిన వేసవి

- హెచ్చరిస్తున్న వాతావరణ నిపుణులు
- రాష్ట్రంలో భగ్గుమంటున్న ఎండలు
- పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల నమోదు
- ఈ ఏడాది వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని నిపుణుల హెచ్చరిక
- బలహీనపడిన తూర్పు గాలులే వేడికి కారణమని విశ్లేషణ
- పలు జిల్లాలకు తీవ్ర వడగాల్పుల హెచ్చరికలు జారీ




**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 17 :**
ఆంధ్రప్రదేశ్‌ను తీవ్రమైన ఎండలు, వడగాల్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ఒక్కరోజే నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే మే, జూన్ నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని, - మిగతా 2 లో

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# సంపాదకీయం

## నేటి బాధ్యతగల బాల్యం
## రేపటి నాగరిక సమాజానికి బలమైన పునాది



### "నేటి బాలలే రేపటి పౌరులు"

ఈ మాట ఎంత నిజమో, ఆ పౌరులను ఎలా తీర్చిదిద్దుతున్నామన్నది అంతే ముఖ్యం. సమాజం పట్ల గౌరవం, తోటి వారి పట్ల బాధ్యత అనేది పుస్తకాల్లో చదివి నేర్చుకునేది కాదు, అది ఆచరణ ద్వారా అలవడాల్సిన గుణం. బాల్యంలోనే వారికి సామాజిక బాధ్యత అనే గొప్ప విలువను అలవాటు చేయడం అత్యంత అవసరం. సామాజిక స్పృహను పెంపొందించడం దేశాభివృద్ధికి మొదటి మెట్టు. చిన్ననాటి అలవాట్లు, విలువలే నాగరిక సమాజ నిర్మాణానికి బలమైన మూలస్తంభాలుగా మారుతాయి. ప్రస్తుతం మన సమాజంలో కనిపిస్తున్న అనేక సమస్యలకు మూలం చిన్ననాటి అలవాట్ల లోపం, బాధ్యత రాహిత్యం. ట్రాఫిక్ నియమాల పట్ల నిర్లక్ష్యం, ప్రజా ప్రదేశాల అపరిశుభ్రత, పరస్పర గౌరవం తగ్గిపోవడం ఇంకా అనేక అంశాల పట్ల చిన్నప్పటి నుంచే అలవాటు చేసే సామాజిక క్రమశిక్షణే రేపటి సమాజ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం. ఇంటి వాతావరణమే పిల్లలకు తొలి పాఠశాల. తల్లిదండ్రుల ప్రవర్తన, మాటతీరు, క్రమశిక్షణ పిల్లలపై శాశ్వత ముద్ర వేస్తాయి. పెద్దలతో గౌరవంగా మాట్లాడడం, చిన్నవారితో ప్రేమగా మెలగడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, ఇంటి పనుల్లో తమ వంతు బాధ్యత తీసుకోవడం వంటి అలవాట్లు వారికి స్వయం బాధ్యతతో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందిస్తాయి. ఈరోజు చిన్నారుల మనసుల్లో నాటిన అలవాట్లే రేపటి సమాజపు స్వరూపాన్ని నిర్ణయిస్తాయి. ఈ విషయాన్నీ గ్రహించి పాఠశాలలు ఈ బాధ్యతను మరింత విస్తరించాలి. పుస్తకాల జ్ఞానంతో పాటు పౌర విలువలు, సామాజిక నైతికత, ప్రజా జీవన శైలి కూడా బోధనలో భాగం కావాలి. బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్, దేవాలయం, ఆసుపత్రి వంటి ప్రజా ప్రదేశాల్లో క్యూ పద్ధతి పాటించడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, రోడ్డు భద్రతను అలవాటు చేయడం, ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండడం, ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేయకపోవడం, నీరు, విద్యుత్ వృథా చేయకపోవడం, మొక్కలను సంరక్షించడం వంటి ప్రాథమిక అలవాట్లు విద్యార్థుల జీవితంలో ఒక భాగంగా పటిష్టం కావాలి. పిల్లలకు వారసత్వంగా ఆస్తులు ఇవ్వడం కంటే సామాజిక బాధ్యత, విలువలు, క్రమశిక్షణ అనే జీవన సంపదను అందించడం గొప్పది. అదే భవిష్యత్తులో బాధ్యత గల పౌరులను, శాంతియుత సమాజాన్ని, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మిస్తుంది. బాల్యంలో మీరు నాటిన బాధ్యత విత్తనమేడ రేపటి సమాజానికి మహావృక్షం అవుతుంది, కల్పవృక్షంగా మారుతుంది.



వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్,
9393613555,9493613555.

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి** – వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ–మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

## పాస్టర్ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు..

**మొదటిపేజీ తరువాయి** – ఇది హవాలా లావాదేవీలకు సంబంధించిన డబ్బు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక పాస్టర్ ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో బాబూరావు కుటుంబం పెద్ద ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసినట్లు, లక్షల్లో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుబడిన డబ్బు గురించి పోలీసులు ప్రశ్నించగా, కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ డబ్బు మూలాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త
## హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

**మొదటిపేజీ తరువాయి** – ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచినట్టు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. "లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హర్మ్యూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హర్మ్యూజ్ జలసంధి అత్యంత వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

**మొదటిపేజీ తరువాయి** – 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.

## తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా?

**మొదటిపేజీ తరువాయి** – విడుదల రజిని గారు టీడీపీ వస్తే అకృత్యాలు జరుగుతాయని అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఒక్కసారి గూగుల్ ఓపెన్ చేసి 2023 ఎన్సీఆర్‌బీ నివేదిక చూడండి. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నేరాలు ఏ స్థాయిలో పెరిగాయో ఆ నివేదిక చెంపదెబ్బ కొట్టినట్లు చెబుతోంది. దక్షిణాదిలో మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడును వెనక్కి నెట్టి ఏపీని నేరాల్లో నంబర్ వన్ చేసిన ఘనత మీ జగన్ రెడ్డిది కాదా?" అని శిరీష ప్రశ్నించారు. దళితులపై అఘాయిత్యాల్లో కూడా రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, మీ హయాంలో జరిగిన నేరాల చిట్టా చూస్తే ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ఆమె నిలదీశారు. చంద్రబాబు పాలనకు, జగన్ గందరగోళ పాలనకు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందని శిరీష అన్నారు. "ఎన్టీఆర్ గారు ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పిస్తే, చంద్రబాబు గారు డ్వాక్రా సంఘాలతో కోటి మంది మహిళలకు ఆర్థిక సాధికారత ఇచ్చారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మహిళలను మహారాణులను చేశారు. కానీ, జగన్ రెడ్డి పాలనలో ఏం జరిగింది? అమరావతికి భూములిచ్చిన ఆడబిడ్డలను నడిరోడ్డుపై ఈడ్చి, వారిపై డ్రోన్లు తిప్పి వేధించిన



క్రూరమైన చరిత్ర మీది. సొంత తల్లికి, చెల్లికి గౌరవం ఇవ్వని జగన్ రెడ్డి, రాష్ట్ర మహిళలకు మేలు చేశామని చెప్పుకోవడం ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్" అని ఆమె విమర్శించారు. వైసీపీ సోషల్ మీడియా సైకోలు టీడీపీ, జనసేన వీరమహిళలపై పెట్టిన అశ్లీల పోస్టుల ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని, తాను కూడా బాధితురాలినేనని శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. "జగనన్న వదిలిన బాణం అని పాదయాత్ర చేసిన చెల్లి షర్మిలపైనే నీచమైన పోస్టులు పెట్టిస్తున్నారు. ఆస్తిలో వాటా అడిగినందుకు కన్నతల్లిని బయటకు గెంటేసిన చరిత్ర జగన్‌ది. సొంత బాబాయ్ వివేకానంద రెడ్డిని చంపిన వారిని శిక్షించాలని పోరాడుతున్న ఆయన కూతురు సునీత రెడ్డిపై సాక్షి పత్రికలో రాయిస్తున్న రాతలు ఎంత అసహ్యంగా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారు. ఇంతటి దమనకాండ సాగించి, ఈరోజు మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు" అని శిరీష సవాల్ విసిరారు. జగన్ హయాంలో జరిగిన దారుణాలను ఆమె పేరుపేరునా ప్రస్తావించారు. 'జై జగన్' అనలేదని చంద్రయ్యను గొంతు కోసి చంపడం, మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపడం, తన సోదరిని ఏడిపించారని అడిగిన పదేళ్ల బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం వంటి రాక్షస పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ముగ్గురు మహిళలకు కీలక శాఖలు ఇచ్చి చంద్రబాబు మహిళా పక్షపాతి అని నిరూపించుకున్నారని, వైసీపీ నేతలు ఇప్పటికైనా అబద్ధాలు ఆపి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని గౌతు శిరీష డిమాండ్ చేశారు.

## రానున్నది మరింత కఠిన వేసవి

**మొదటిపేజీ తరువాయి** – ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని 215 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కోస్తా, రాయలసీమ ప్రాంతాలు వేడికి అట్టుడికిపోయాయి. శుక్రవారం కూడా మన్యం, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో 43–44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు



నమోదు. సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 55 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈ ఏడాది వేసవి తీవ్రతకు బలహీనపడిన తూర్పు గాలులే ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వేడిని తగ్గించే తూర్పు గాలుల ప్రభావం తగ్గింది. అదే సమయంలో, ఉత్తరాది నుంచి వీస్తున్న పొడి, వేడి గాలులు దక్షిణాది రాష్ట్రాలపైకి ప్రభావం చూపుతున్నాయని ఇస్రో నిపుణులు తెలిపారు. దీనికి తోడు, పసిఫిక్ మహాసముద్రంలో లానినా బలహీనపడటం కూడా వాతావరణం వేడెక్కడానికి దోహదం చేస్తోందని వారు అంచనా వేస్తున్నారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 'అర్బన్ హీట్ ఐలాండ్స్' ప్రభావం వల్ల వేడి తీవ్రత పెరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకస్మిక వర్షాలు కురిస్తే తప్ప ఈ వేడి నుంచి ఉపశమనం లభించడం కష్టమని వారు అభిప్రాయపడుతున్నారు.

## మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

**మొదటిపేజీ తరువాయి** – దేశాభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని, తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది



కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ చారిత్రాత్మక బిల్లు అమలు కాబోతుండటం అభినందనీయమన్నారు. డీలిమిటేషన్ అంశంపై కూడా టీడీపీ తన స్పష్టమైన వైఖరిని చాటింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదని, దీనిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్ ఒక కీలక అడుగని, దీనివల్ల మహిళలతో పాటు యువతకు కూడా రాజకీయాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం ఎన్నో ఏళ్లుగా సాగుతున్న పోరాటాలకు ఈ బిల్లుతో ఒక తార్కిక ముగింపు లభిస్తుందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

## రాజధాని పరిధిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ

**మొదటిపేజీ తరువాయి** - మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా బీసీ-ఏలో (1090), బీసీ-ఈ (1087), ఓసీల్లో (1108) వర్గాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా బలంగా ఉంది. ముస్లిం మైనారిటీలు(బీసీ–ఈ)లో లింగ నిష్పత్తి 1087గా ఉంది. బీసీ–సి(962) వర్గాల్లో మాత్రం పురుషులతో పోలిస్తే మహిళల జనాభా తక్కువగా ఉంది.

**రంగారెడ్డి జిల్లా..**

రంగారెడ్డి జిల్లాలో 1095 లింగ నిష్పత్తితో తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిచింది.

ఓసీల్లో 1145తో పురుషుల కంటే మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోనే ఇది అత్యధికం.

ఎస్టీల్లో లింగ నిష్పత్తి 1137గా నమోదైంది. బీసీ–సి సామాజిక వర్గంలో 1008గా లింగ నిష్పత్తి ఉంది.

**మేడ్చల్–మల్కాజిగిరిలో..**

మేడ్చల్ జిల్లాలో సగటు లింగ నిష్పత్తి 1066గా ఉంది.

ఈ జిల్లాల్లో ఎస్టీ సామాజిక వర్గంలో 1088, ఓసీల్లో 1097, బీసీల్లో 1053 నిష్పత్తిలో మహిళలు ఉన్నారు. ఎస్సీల్లో సగటు 1026గా ఉంది.

**1000 : 1095**

నగర జీవనంలో అతివల సారథ్యం : పట్టణ ప్రాంతాల్లో సామాజిక మార్పు స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూడు జిల్లాల గణాంకాలను పరిశీలిస్తే కుటుంబానికి మహిళలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఈ లెక్కలు చెబుతున్నాయి. జీహెచ్‌ఎంసీలో 21.8 శాతం, రంగారెడ్డి జిల్లాలో 20.4శాతం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 18.9శాతం మంది మహిళలే ఇంటి యజమానులుగా ఉండటం అభినందనీయమైన విషయం. ఈ లెక్కన తెలంగాణవ్యాప్తంగా సగటు 23.9 శాతంగా ఉంది.

**నెలకు రూ.5 వేల సంపాదన :** మహానగరం హైదరాబాద్‌లో నెలకు కేవలం రూ.5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం



మంది జీవనం కొనసాగిస్తున్నారు. ఇది రాష్ట్ర సగటు(12శాతం) కంటే తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9.3 శాతం, జీహెచ్‌ఎంసీలో 9.2 శాతం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 8.1 శాతం మంది ప్రజల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.50 వేల లోపు మాత్రమే ఉంది.

**ఇంకా బావులు, చేతి పంపులు :** గ్రేటర్ హైదరాబాద్‌లో 89 శాతం మందికి కుళాయిలు ఉండగా మేడ్చల్ జిల్లాలో 86.3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 85.3 శాతంగా ఉంది. గ్రేటర్ పరిధిలో చేతిపంపులపై ఆధారపడిన వారు ఇప్పటికీ 3.3 శాతం, మేడ్చల్ జిల్లాలో 2 శాతం, రంగారెడ్డి జిల్లాలో 2.4.శాతం మంది ఉన్నారు.

**కులాంతర వివాహాల్లో టాప్ :** రాష్ట్రంలోనే కులాంతర వివాహాల్లో అగ్రస్థానంలో జీహెచ్‌ఎంసీ ఉండగా తర్వాత స్థానాల్లో మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలు చోటు దక్కించుకున్నాయి. గ్రేటర్ పరిధిలో 14.3 శాతం కులాంతర వివాహాలు జరగ్గా, మేడ్చల్ జిల్లాలో 9.9.శాతం, రంగారెడ్డి జిల్లాలో 8.4 శాతంగా నమోదు అయ్యాయి.

**ముందస్తు వివాహాలు అధికం :** జీహెచ్‌ఎంసీలో ముందుస్తు వివాహాలు ఎక్కువగా ఉన్నాయి. 11.1 శాతం మంది పురుషులు పెళ్లి వయస్సు రాక ముందే వివాహాలు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7 శాతం పురుషులు, 7.3 శాతం స్త్రీలు, మేడ్చల్‌లో పురుషులు 6.6శాతం, స్త్రీలు 6.8శాతం మేర చట్టబద్ధ వయసులోపే వివాహ జీవితంలోకి అడుగుపెట్టారు.

**వైద్యం కోసం, రుణమే శరణ్యం! :** వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలున్నప్పటికీ ఏ మాత్రం ఊరట లేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో దాదాపు 11.5 శాతం మంది మెడికల్ పరంగా అప్పులు చేస్తున్నారు. నగరంలోని ఎస్సీ కేటగిరీ పేదలు దాదాపు 12.5 శాతం మంది అప్పుల కోసం అనధికార వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు.

**గ్రేటర్‌లో అక్షరాస్యులు 90 శాతం :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తే ఆరేళ్ల నుంచి 29 ఏళ్ల వారిలో చదువుకున్న వారు 90 శాతం మంది ఉన్నారు. ఇందులో జీహెచ్‌ఎంసీ పరిధిలో 84.7శాతం మంది ఉండగా, అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 90.4శాతం మంది విద్యావంతులున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చదువుకున్న విద్యార్థుల్లో అత్యధికంగా ఇంగ్లీష్ మీడియం వారున్నారు. రెండో స్థానంలో తెలుగు, మూడో స్థానంలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో తెలుగును మాతృ భాషగా మాట్లాడేవారు 53.10శాతంమంది ఉంటే, ఉర్దూ మాతృ భాషగా మాట్లాడేవారు 37.5 శాతం మంది. హిందీ మాతృ భాషగా మాట్లాడుతున్న వారు 6 శాతం ప్రజలు ఉన్నారు.

## దక్షిణాదికి అన్యాయం జరగదు..

**మొదటిపేజీ తరువాయి** – నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు. మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.



## లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

వెనక్కి తీసుకుంది. ఈ మేరకు పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభ ప్రకటన చేశారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను వాయిదావేశారు. భారత రాజ్యాంగాన్ని సవరించే బిల్లును పరిగణనలోకి తీసుకోవాలన్నది ఇక్కడ ప్రశ్న. సవరణలకు లోబడి, ఓట్ల విభజన ఈ విధంగా ఉంది. అనుకూలం (అవును) – 298, వ్యతిరేకం (కాదు) – 230 రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 నిబంధనల ప్రకారం, సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో మెజారిటీ, సభకు హాజరై ఓటు వేసిన సభ్యులలో కనీసం మూడింట రెండొంతుల మెజారిటీ ఈ తీర్మానానికి రానందున ఇది ఆమోదం పొందలేదు. కాబట్టి, ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై తదుపరి చర్యలు కొనసాగించడం సాధ్యం కాదు. అందువల్ల, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026, డీలిమిటేషన్ (పునర్విభజన) బిల్లు 2026 కి సంబంధించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. – **ఓం బిర్లా, లోక్‌సభ స్పీకర్**

**మిగతా రెండు బిల్లులు వెనక్కి తీసుకున్న కేంద్రం**

131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయినందున మిగతా రెండు బిల్లులు డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026లను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. రాజ్యాంగ 131వ సవరణ బిల్లుతో పాటు, మరో రెండు బిల్లులు ఉన్నాయి. అవే కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026, డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లు 2026. ఇవి రాజ్యాంగ 131వ సవరణ బిల్లుతో అంతర్గతంగా ముడిపడి ఉన్నాయి. వీటిని విడిగా చూడలేము. ఇప్పుడు వచ్చిన ఫలితం చూస్తే... దేశంలోని మహిళలకు గౌరవం, హక్కులు కల్పించే ఇంతటి చారిత్రాత్మకమైన, కీలకమైన బిల్లుకు ప్రతిపక్షం మద్దతు ఇవ్వలేదు. ఇది చాలా విచారకరం. ఈ చారిత్రాత్మక ఘట్టంలో మీకు దక్కిన ఒక మంచి అవకాశాన్ని చేజార్చుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు గౌరవం, హక్కులు కల్పించేందుకు మా కృషి నిరంతరం కొనసాగుతుంది. భవిష్యత్తులో వారికి ఆ హక్కులను మేము కచ్చితంగా అందించి తీరుతాము.– **కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి**

**మూడింట రెండు వంతుల మెజారిటీ తప్పనిసరి**

రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే తీర్మానాలకు సాధారణ మెజారిటీ సరిపోతుంది. అయితే, ఈ బిల్లుల కీలక నిబంధనలను ఆమోదించడానికి, అలాగే బిల్లులను పరిశీలించి ఆమోదించే తీర్మానాలకు మాత్రం సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో మెజారిటీతో పాటు, హాజరై ఓటు వేసిన సభ్యుల్లో కనీసం మూడింట రెండు వంతుల మెజారిటీ తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368(2) లోని మినహాయింపు నిబంధనలో పేర్కొన్నట్లుగా, అత్యంత కీలకమైన అంశాలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన తర్వాత కనీసం సగం రాష్ట్రాల శాసనసభల ఆమోదాన్ని కూడా పొందాల్సి ఉంటుంది.



## ఆసుపత్రిలో మెరుగైన సేవలు ప్రజలకు అందించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

**సీసీ రోడ్డు పనులు, పరిశుభ్రత, శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని అధికారులకు సూచన**

**అదనపు ఓపీ బ్లాక్ ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17( వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష (రామగుండం)గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి,ఆసుపత్రిలోని మెడికల్ ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ,తక్షణమే తనను కలవాలని ఆదేశించారు.రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.ల్యాబ్ యంత్రాలు, ఏసీ వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్ లు కృపా బాయి,రాజు,సంబంధిత అధికారులు,ఆసుపత్రి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్ అవార్డు ఇవ్వాలే...

**ఆనాడు తిరస్కరించిన కరెంటోళ్లను కీర్తించేలా చేసిన మాజీ సీఎం కేసీఆర్**

**న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**




**మంథని, ఏప్రిల్ 17(వార్త సంధ్య) :** ప్రజలను మోసం ఎలా చేయాలో మోసం చేసి ఎలా దర్జాగా ఉండాలో చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్, పద్మశ్రీ అవార్డులు ఇవ్వాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత పది రోజులుగా మంథని డివిజన్ కార్యాలయం మరియు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సూపర్డెంట్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో విద్యుత్ అర్టిజన్, అన్‌మ్యాన్డ్, పీస్‌రేటు కార్మికుల నిరవధిక సమ్మె దీక్షా శిభిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలుపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మార్పు పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిందని,గత 28నెలలుగా ఇబ్బందులు పెడుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఏ విదంగా ఉంటుందో అధికారం వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో 18ఏండ్ల ఓటు హక్కు కల్గిన వ్యక్తి యాభై ఏండ్ల వరకు గుర్తుండే విధంగా పరిపాలన చేయడం అద్భుతంగా బావించవచ్చున్నారు. దేశంలో పద్మశ్రీలు, పద్మభూషన్‌లు అవార్డులు సేవలు చేసే వారికి మాత్రమే ఇస్తారని, కానీ ఇందిరమ్మ మార్పు పేరుతో ఇందిరమ్మ ప్రజా పాలన పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ అవార్డులు ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ని కార్యకర్త నుంచి రాహుల్ గాంధీవరకు ఈ విధంగానే వ్యవహరిస్తున్నారని, మహిళలకు 2500లు ఇయ్యకుండా ఇచ్చినట్లు, బీసీ రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఇచ్చినమని చెప్తున్నారని అన్నారు. అన్ని చేసినమని మానీఫెస్టో కమిటి చైర్మన్ జీ తెలుగు ఇంటర్వూలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అబద్దాలు ఆడటంలో ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని, ప్రజలు ఆలోచన చేయడం లేదని, అవగాహన, చైతన్యం లేదని కాంగ్రెస్ పార్టీ బావస్తోందని అన్నారు. ఈనాటి వరకు ఎదిరిస్తలేం,నిలదీస్తలేం కనుకనే అలా చెప్పుకుంటూ పోతున్నరన్నారు. ఆనాడు పాదయాత్ర చేసిన సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క విద్యుత్ కార్మికుల హామీ ఇచ్చి ఈనాడు విస్మరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేయడంలో అద్బుతాలు సృష్టిస్తోందని విమర్శించారు. ఈనాటికి రిటైర్డ్ మెంట్ వరకు వచ్చినా ఇంకా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నయో వాటిని పూర్తి చేయడం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె సరైందన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడక ముందు కేసీఆర్ రాకముందు కరెంటు వాళ్లను ఎలా తిరస్కరించుకునే పరిస్థితి ఉందో చూశామని, కానీ పదేళ్ల కాలంలో అదే కరెంటోళ్లను కీర్తించే స్థాయికి కేసీఆర్ తీసుకువచ్చారని అన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాకపోవచ్చు కానీ గౌరవించే వరకు తీసుకువచ్చారని అన్నారు. ఇందిరమ్మ పాలన అంటే చీకటి మోస దగా పాలన అనే రీతికి తీసుకువచ్చిండ్లని, కార్మికుల నిరవధిక సమ్మె ఇందుకు ఉదాహరణ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదేండ్ల తర్వాత ప్రజలు కొంత వ్యతిరేకించవచ్చు కానీ ఈనాడు రెండున్నర ఏండ్లకే కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడిలకు భయపడవద్దని,బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా కల్పించారు.

## కోకిలంపాడు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..




**తిరువూరు, ఏప్రిల్ 17(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామంలో కట్టలేరు సప్లై ఛానల్ పూడికతీత మరియు మరమ్మత్తుల పనులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఘనం గా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వనరుల అభివృద్ధి ద్వారా రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని,పూడికతో నిండిపోయిన కాలువలను శుభ్రపరచడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, చివరి ఎకరానికి కూడా నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియాజే సారు.కట్టలేరు సప్లై ఛానల్ పూడికతీత పనులు పూర్తయిన అనంతరం, ఈ ప్రాంతంలోని పంటలకు సమృద్ధిగా నీరు అందడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల రైతులకు ద్విగుణీకృత లాభం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.అలాగే, గ్రామంలో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, రహదారులు, కాలువలు, తాగునీటి సౌకర్యాలు వంటి మౌళిక వసతులను మెరుగు పరచడానికి ప్రత్యేక దృష్టి సారిస్తు న్నామని,కట్టలేరు సప్లై ఛానల్ పూడికతీత మరియు మరమ్మ త్తుల పనులను ప్రారంభించిన వారికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేస్తూ, పనులు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగి స్తామని తెలిపారు.గ్రామ అభివృద్ధి, రైతుల సంక్షేమమే తన ముఖ్య లక్ష్యమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలు అందిస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పట్టణ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ఓపీ తర్వాత కూడా వైద్యులు ఆసుపత్రిలో ఉండాలి**

**అవసరమైన వైద్యులు, సిబ్బందిని**

**కాంట్రాక్ట్ విధానంలో వెంటనే నియమించాలి**

**ప్రైవేట్ ఆసుపత్రులకు అవసరం లేకుండా రిఫర్**

**చేయరాదు అన్ని సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందాలి**


**మందులు, పరికరాల కొరత లేకుండా స్టాక్ నిర్వహణ,**

**యంత్రాల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17 (వార్త సంధ్య ) :** ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓపీ సంఖ్యలు తగ్గుతున్న అంశంపై వెంటనే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రిలో రోజువారీ ఓపీ వివరాలను సమీక్షిస్తూ రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. అన్ని విభాగాల్లో అవసరమైన వైద్యులను కాంట్రాక్ట్ విధానంలో వెంటనే నియమించాలని, ఎటువంటి ఖాళీలు లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్యులు సమయానికి విధులకు హాజరు కావడంతో పాటు ఓపీ సమయం ముగిసిన తర్వాత కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత వైద్యులు అందుబాటులో లేరనే ఫీడ్‌బ్యాక్ ఉన్నందున ఇటువంటి పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలో ఓపీ సంఖ్యలు తగ్గుతున్నాయని పేర్కొంటూ దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ రోగి కూడా సేవల నుండి వెలుపల ఉండకూడదని స్పష్టం చేశారు. కొంతమంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఫీడ్‌బ్యాక్ ఉన్నందున అవసరం లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పంపకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు లేనప్పుడు తరచుగా కేసులు వస్తున్నట్లయితే వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, అవసరమైన పరికరాలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోగికి అవసరమైన అన్ని సేవలు అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ స్టాక్‌లో లేని కానీ అవసరమైన మందుల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని, జిల్లా నిధులతో కనీసం మూడు నెలల స్టాక్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.మందులు, ఔషధాలు లేదా ఇతర అవసరమైన వస్తువుల కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని ఆదేశించారు. వైద్య పరీక్షల కోసం అవసరమైన సామగ్రి స్టాక్‌ను నిరంతరం తనిఖీ చేయాలని, యంత్రాల్లో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు.ఆసుపత్రికి అవసరమైన కొత్త ఏసీల కోసం ప్రతిపాదనలు పంపించాలని, వెంటనే ఆమోదం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెక్యూరిటీ గార్డుల అవసరాన్ని సమర్పించాలని, వాటి ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్యవసర కేసుల్లో పేషెంట్ కేర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది మొత్తం 120 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 115 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ సిబ్బంది మూడు షిఫ్ట్‌లలో పనిచేస్తారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అదనపు సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్.కృపా బాయ్, డాక్టర్ రాజు,డాక్టర్.ప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గౌరవంపై రాజీ లేదు
## స్పీకర్‌ను కలిసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ


VAMSI KRISHNA GADDAM
MEMBER OF PARLIAMENT
LOK SABHA
PEDDAPALLI CONSTITUENCY

Ph. No: 8008292924

LR No. 1089 /17-04-2026/ Delhi.

Date: 17-04-2026

To,
Shri Om Birla Ji
Honorable Speaker of Lok Sabha
Parliament House
New Delhi

Respected Sir,

I, Vamsi Krishna Gaddam, Hon'ble Member of Parliament from Peddapalli Constituency, wish to draw your kind attention to the recent remarks made by Hon'ble Member of Parliament Shri Tejasvi Surya regarding the formation of Telangana.

The said remarks have caused deep hurt to the sentiments of the people of Telangana, who hold immense respect for the sacrifices and democratic struggle that led to the creation of the state. Such statements, in my respectful submission, are inappropriate and inconsistent with the dignity and decorum expected in parliamentary proceedings.

In this regard, I humbly request your good office to kindly exercise the powers vested under the Rules of Procedure and Conduct of Business in Lok Sabha, particularly Rule 380, to expunge the objectionable remarks from the official records of the House.

Further, I request that Shri Tejasvi Surya be directed to withdraw the remarks and issue a public apology, in order to uphold the standards of parliamentary conduct and maintain public trust in democratic institutions.

Additionally, it is a matter of concern that statements made by Shri Kishan Reddy in this context appear to mislead the House. I respectfully request that your good office may examine whether such statements constitute a breach of privilege or violation of established parliamentary norms, and take appropriate action as deemed fit.


I trust that this matter will receive due consideration and that necessary steps will be taken to uphold the dignity, integrity, and decorum of the House.

Thanking you.

Yours sincerely,
Vamsi Krishna Gaddam
MP, Peddapalli Constituency

Member of Consultative Committee for the Ministry of Heavy Industries
Member of Standing Committee - Science and Technology

33, Ferozeshah Road, New Delhi - 110001
Email: vamsi.gaddam@sansad.nic.in, Phone No: 8008292924



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17( వార్త సంధ్య ) :** పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించేలా చేసిన వ్యాఖ్యలపై పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై శుక్రవారం తెలంగాణకు చెందిన ఎనిమిది మంది ఎంపీలు కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరియు ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అవి పార్లమెంట్ రికార్డుల నుండి వెంటనే తొలగించాలని (ఎక్స్‌పంజ్ చేయాలని) స్పీకర్‌ను కోరినట్లు వంశీకృష్ణ తెలిపారు. స్పీకర్ ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించి, ఆ వ్యాఖ్యలు తగవని అంగీకరించి, వాటిని రికార్డుల నుండి తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం అనేక బలిదానాలు, పోరాటాల ఫలితమని, అలాంటి రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీయే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితు ల్లోనూ సహించబోమని వంశీకృష్ణ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ బాధ్యత అని, రాష్ట్ర హక్కుల కోసం ఢిల్లీ వేదికగా ఎల్లప్పుడూ పోరాడుతామని ఆయన పున రుద్ఘాటించారు.

## కాటారంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17: ( వార్త సంధ్య ) :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 20న భూపాలపల్లి జిల్లా మేడిగడ్డలో పర్యటిం చనున్నారు.ఈ నేపథ్యం లో కాటారం మండలం నస్తూరిపల్లిలో బహిరంగ సభ నిర్వహించనున్నా రు.సీఎం రేవంత్ రెడ్డి,పర్యటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. సరిగ్గా 2023 ఎన్నికల సమయంలో ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇప్పటికీ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.ఈ ఆరోపణలను బీఆర్ఎస్ ఖండిస్తోంది.అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరిపి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించింది.ఈ కమిషన్ ఏర్పాటు అది సమర్పించిన నివేదికపై బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా దానికి సంబంధించిన తుది తీర్పు త్వరలోనే వెల్లడి కానుంది. 20న సీఎం రేవంత్ రెడ్డి,కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని స్వయంగా పరిశీలించనున్నారు.గతంలో కుంగిపోయిన ఈ మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన పిల్లర్లను పరిశీలించి పునరుద్ధరణ పనుల పురోగతిపై ఇంజి నీరింగ్ అధికారులతో రేవం త్ రెడ్డిచర్చించనున్నారు.అదే సమయంలో కాళే శ్వరం పరిధిలోని గోదావరి నది వద్ద నిర్వహించినున్న సరస్వతి అంత్య పుష్క రాల ఏర్పాట్లపైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేయనున్నారు.

## అస్సాం సిఎం హేమంత బిశ్వ శర్మ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.

**ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్కపాక సంపత్ కుమార్**




**మంథని, ఏప్రిల్ 17 (వార్త సంధ్య) :** గురువారం రోజున అస్సాం సిఎం హేమంత్ బిశ్వ శర్మ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే పైన కుల వివక్షమైన ఆరోపణలు చేసి మతోన్మాద శక్తులను ప్రేరేపించి ఒక దళిత నాయకుడైన మల్లికార్జున కార్గే మీద అనుచిత ఆరోపణలు చేసినందుకు వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయవలసినదిగా శుక్రవారం మంథని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్ పాల్గొన్నారు.

## గుంజపడుగు సోలార్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన నాబార్డ్ అధికారులు



**పెద్దపల్లి ,మంథని ,ఏప్రిల్ 17 (వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామ శివారులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.3.40కోట్ల వ్యయంతో పిఎం కుసుమ్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన 1 మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ ను శుక్రవారం ముంబై నుంచి వచ్చిన నాబార్డ్ అధికారులు పరిశీలించారు. సోలార్ ప్లాంట్ లో త్వరలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా శరవేగంగా పనులు చేపడుతున్నట్లు సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ అధికారులకు వివరించారు. ఈ పవర్ ప్లాంట్ లో రోజుకు 5000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం జయప్రకాష్, పలువురు నాబార్డ్ అధికారులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

## కాకతీయ హై స్కూల్ కు 2025-26 ఎడ్యుకేషన్ శిక్ష అవార్డు




**మంథని, ఏప్రిల్ 17 (వార్త సంధ్య) :** మంథని కాకతీయ హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2025 -26 విద్యా సంవత్సరము ఎల్ కే జి నుండి ఐదవ తరగతి వరకు లీడ్ గ్రూపు వారు నిర్వహిస్తున్న కరికులం ప్రోగ్రాంలో భాగంగా శిక్ష అవార్డ్స్ 2025- 26 కు గాను సౌత్ జోనల్ విన్నర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ శిక్ష అవార్డును మంథని కాకతీయ హై స్కూల్ కి రావడం జరిగిందని ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు ను శుక్రవారం నోవోటెల్ కన్వెన్షన్ సెంటర్ , హైటెక్ సిటీ హైదరాబాద్ లో జరిగిన శిక్ష అవార్డ్స్ 25-26 నిర్వహించిన కార్యక్రమంలో లీడ్ కోఆర్డినేటర్ పావని రెడ్డి మరియు ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డికి అవార్డ్ ప్రధానం చేశారు . ఈ సందర్భంగా ప్రతి గొప్ప పాఠశాల వెనుక గొప్ప విద్యావేత్త ఉంటాడని దీనికి మీరే సజీవ సాక్ష్యం అని లీడ్ గ్రూప్ సి ఈ ఓ సుమిత్ కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ మంథని వంటిమారుమూల ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దామని. మీరు మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మా పిల్లలను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు. పాఠశాల డైరెక్టర్లు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. అదేవిధంగా పాఠశాల లీడ్ గ్రూప్ కోఆర్డినేటర్ పావని మేడంను మరియు ప్రదీప్ రెడ్డిని అభినందించారు.

## పాడి గేదెల పెంపకం పథకానికి
## దరఖాస్తు గడువు ఏప్రిల్ 23 వరకు పొడిగింపు

కార్యనిర్వహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17( వార్తసంధ్య) :** వార్షిక ప్రణాళిక 2025-26 సంవత్సరానికి జిల్లాలో అమలు చేస్తున్న 2 పాడి గేదెల పెంపకం పథకానికి సంబంధించి ఆన్లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 23 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ కార్యనిర్వహక సంచాలకులు జి.శ్రావణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ఆన్లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సంబంధిత మున్సిపల్ ,మండల పరిషత్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.పథకానికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పాడి గేదెల పథకం కోసం కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 20లోపు https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వహక సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు.

## పెండింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం




హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 17 : తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భాగంగా, 17-04-2026 (శుక్రవారం) మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు భోజన విరామ సమయంలో, భీమ భవన్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్ కార్యాలయాల సమీపంలో) నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం హైద రాబాద్ సిటీ చైర్మన్,కట్కూరి శ్రీకాంత్ ,కన్వీనర్ గశీదూరి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్య క్రమా నికి ముఖ్య అతిథులుగా మారం జగదీశ్వర్ చైర్మన్, ఎలూరి శ్రీనివాస్ రావు (సెక్రటరీ జనరల్, హుస్సేని (ముజీబ్)(డిప్యూటీ సెక్రటరీ జనరల్) ,బి శ్యామ్ స్థిత ప్రజ్ఞ హాజరయ్యారు. కార్యక్రమంలో హైదరా బాద్ సిటీ నాయకత్వం వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యంగా . కె వెంకటేశ్వర్లు, సత్య నారా యణ గౌడ్, పి. హరి కృష్ణ, నిరంజన్ రెడ్డి, నరేంద్ర రావు, లక్ష్మణ్, శ్రీనివాస్, కృష్ణ, జి.శ్రీనివాస్ గౌడ్, ఎం నాగిరెడ్డి, సి.అమరేందర్, . బి బాబుశంకర్, కె.స్వరూప, ఏరాజు, పిప్రభాకర్ రెడ్డి, మల్లి కార్జున్, ఎం లక్ష్మి, షేక్మహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంతోష్, బాల నర్సింగ్,ఆదిత్య, మహేష్, సత్య నారాయణ, నవీన్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, గెజిటెడ్ అధి కారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సి.పి.ఎస్ ఉద్యోగులు భారీగా పాల్గొని తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మద్దతు తెలిపారు.

**ముఖ్య డిమాండ్లు:** 51 శాతంఫిట్‌మెంట్‌తో పి.ఆర్.సి ప్రకటించాలి ,ఉద్యోగుల హెల్త్ స్కీమ్ అమలు చేయాలి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి,సి.పి.ఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి అమలు చేయాలి సెక్రటేరియట్‌లో 12.5 శాతం కోటా అమలు చేయాలి,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

## కేంద్ర ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో భేటీ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 17 : 2025-26 (వానా కాలం+యాసంగి) సీజన్ కు 30 లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి వినతి -2025-26 యాసంగి పంట 90 ఎల్ఎంటీ వస్తుందని కేంద్ర మంత్రికి తెలియజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## మైలార్ దేవుపల్లి నుంచి శాస్త్రీపురం మీదుగా వట్టేపల్లి వరకు రూ.71 కోట్లతో నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్డి(ఆర్వోబీ)ని శుక్రవారం


రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు లాంఛనంగా ప్రారంభించారు.





హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 17 : నాలుగు లేన్లతో కూడిన ఈ వంతెన పొడవు 490 మీటర్లు, వెడల్పు 16.6 మీటర్లు. రైల్వే పోర్షన్ పొడవు 37.28 మీటర్లు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో మైలార్ దేవుపల్లి నుంచి ఫలక్ నుమా వరకు 30 నిమిషాల్లో చేరుకోవచ్చు.

## హైదర్ నగర్‌లో వివాహిత అదృశ్యం: కెపిహెచ్‌బి పోలీసులకు ఫిర్యాదు



వార్తా సంధ్య కూకట్‌పల్లి : కుటుంబ సభ్యులు శుభకార్యానికి వెళ్లిన సమయంలో ఓ వివాహిత ఇంటి నుండి అదృశ్యమైన ఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హైదర్ నగర్, నందమూరి నగర్‌కు చెందిన మహమ్మద్ ఖలీల్ మియా కుమార్తె రజియా బాను బేగం (25) గత ఆరు నెలలుగా తన తండ్రి వద్దే ఉంటోంది. వివాహం జరిగినప్పటికీ భర్తతో మనస్పర్థల కారణంగా ఆమె పుట్టింట్లో ఉంటూ, హైటెన్షన్ లైన్ సమీపంలోని ఒక బట్టల దుకాణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 16వ తేదీ ఉదయం 7 గంటలకు కుటుంబ సభ్యులంతా జహీరాబాద్‌లో ఒక ఫంక్షన్‌కు వెళ్తుండగా, తలనొప్పిగా ఉందని చెప్పి రజియా ఇంటి వద్దే ఉండిపోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో కుటుంబ సభ్యులు తిరిగి వచ్చేసరికి రజియా కనిపించకుండా పోయింది. ఆమెతో పాటు తన లగేజీ మరియు వ్యక్తిగత సామాగ్రిని కూడా తీసుకువెళ్లినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు కెపిహెచ్‌బి పోలీసులు 'మహిళా మిస్సింగ్' కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## లహుజీ సాల్వె పుస్తకం ఆవిష్కరణ: శ్రీ జూపల్లి కృష్ణా రావు, పర్యాటకం & సాంస్కృతిక శాఖా మంత్రి



హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 17 : హైదరాబాద్ లోని తెలంగాణ సెక్రటేరియట్ లో తన కార్యాలయంలో శ్రీ జూపల్లి కృష్ణా రావు, ప్రొహిబిషన్ & ఎక్సయిజ్ , పర్యాటకం, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖా మంత్రివర్యులు తన కార్యాలయంలో క్రాంతిపిత గురువర్య లహుజీ సాల్వె పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్రీ చంద్రకాంత్ వాన్ ఖేడ్ రచించిన మరాఠీ పుస్తకం ను శ్రీ గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ తెలుగులో అనువాదం చేయగా, తెలంగాణ సాహిత్య అకాడెమీ ద్వారా ప్రచురించడం జరిగింది. మంత్రి మాట్లాడుతూ వివాహం చేసుకోకుండా జీవితాన్ని దేశం సమాజ సేవకు అంకితం చేసి వేలాదిమంది స్వాతంత్ర్య పోరాట వీరులను తయారుచేసిన క్రాంతిగురు లహుజీ సాల్వె. అయన మహాత్మా జ్యోతిబా పూలే కు గురువు కూడా. పూలేకు అండగా ఉండి ఆ కాలంలో విద్యా సామాజిక కార్యక్రమాలను విజయవంతం చేయుటలో ప్రముఖ పాత్ర పోషించారు. లహుజీ సాల్వె చరిత్ర తెలుగు వారికీ కూడా అందుబాటులో ఉండాలని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ సాహిత్య అకాడెమీ ద్వారా ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ప్రతి ఒక్కరు ఈ పుస్తకం ద్వారా అయన చరిత్రను, అయన కృషిని తెలుసుకొని వారి ఆశయాలను ముందుకు తీసుకొనివెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో డా.నామోజు బాలచారి ( కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడెమీ) జంగిటి వెంకటేష్ (సీనియర్ జర్నలిస్ట్) యు.నాగార్జున , గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ (రచయిత)సోమశిల తిరుపాల్ (సాహితీవేత్త) పాల్గొన్నారు.

# బ్యారేజీ పునరుద్ధరణ పనులు వేగవంతం

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

వానాకాలం నాటికి పరీక్షలు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి(వార్త సంధ్య)ఏప్రిల్ 17: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ లో ఉన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ తో భేటి అయ్యారు. బ్యారేజీల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక ను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్ డీఎస్ ఏ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే తాను స్వయంగా బ్యారేజీలను సందర్శన కు వస్తానని చెప్పారు.

### దశలవారీగా శాస్త్రీయ పరీక్షలు

బ్యారేజీల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిపుణుల సంస్థలను ప్రభుత్వం నియమించింది. డిజైనింగ్, టెస్టింగ్ సంస్థలు రంగంలోకి దిగాయి. డిజైన్‌కు ముందు అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థ చేస్తుంది. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జీపీఆర్ (గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) స్కానింగ్ , డ్రోన్ సర్వేలు, బోర్ హోల్స్ , జియోటెక్నికల్ , జియోఫిజికల్ పరీక్షలతో భూమి, అక్కడ నిర్మాణాల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోనున్నారు.

### సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ

వివిధ సంస్థల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధులు , డిజైనింగ్ సంస్థ ప్రతినిధులు, ఇతర టెక్నికల్ ఏజెన్సీలు సభ్యులుగా ఉన్నారు. పరీక్షలు సకాలంలో జరిగేలా చూడడం.. అవసరమైన డేటా సమయానికి అందించడం, అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవడం ఈ కమిటీ చూసుకుంటుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగేందుకు, కేంద్ర స్థాయి నిపుణుల పర్యవేక్షణ కూడా ఉండే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అవసరమైతే ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ఇందులో చేర్చే అవకాశముంది.

### అన్ని కోణాల్లో విశ్లేషించి..

ప్రస్తుతం బ్యారేజీల ఫౌండేషన్, కట్ ఆఫ్ వాల్ పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనా వేయనున్నారు. అన్ని రకాల పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత, ఇప్పుడున్న నిర్మాణ లోపాలు గుర్తించి... పూర్తి సమాచారం విశ్లేషణల ఆధారంగా వాటికి అనుగుణంగా పునరుద్ధరణ పనులకు డిజైనింగ్ సంస్థ కొత్త డిజైన్లు సిద్ధం చేస్తారు. ఈ డిజైన్‌ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కి పంపించి.. వాళ్ళు ఇచ్చే సూచనలు మార్గదర్శకాలకు అనుగుణంగా పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ దేశంలో ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతను నిరంతరం పర్యవేక్షించే బాధ్యత కలిగిన చట్టబద్ధమైన సంస్థ.

### వానాకాలం ముందే పరీక్షలు

రానున్న మూడు నాలుగు నెలల్లో (వర్షాకాలం ముందు) అన్ని పరీక్షలు పూర్తి చేసి, డిజైన్లు సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాకాలం తరవాత పునరుద్ధరణ పనుల ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

### దీర్ఘకాలిక మనుగడ లక్ష్యం

పునరుద్ధరణ పనులు పూర్తిగా శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం అమలు చేసి, భవిష్యత్తులో 50 నుంచి 100 ఏళ్ల పాటు బ్యారేజీలు సురక్షితంగా భద్రంగా ఉండేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### బ్యారేజీలను శాస్త్రీయ పద్దతుల్లో బాగు చేస్తం
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

గత ప్రభుత్వ లోపాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను శాస్త్రీయ పద్దతుల్లో బాగు చేయడమే తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం ఎన్ డీఎస్ ఏ, సీడబ్లూసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఐఐటి ముంబయిలోని నిపుణుల సహకారంతో అత్యధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తి చేసి, వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. పారదర్శకత కోసం ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం లో కీలక నియామకం
## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడుకొండల వెంకటేశం ఏకగ్రీవ ఎన్నిక



నల్గొండ ఏప్రిల్ 17 (వార్త సంధ్య ): తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశం ఘనంగా,ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు అధ్యక్షత వహించగా,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుమ్మరి లక్ష్మీనారాయణ టి.కె. శ్రీనివాస్ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ,వృత్తిదారుల అభ్యున్నతి,యువతలో చైతన్యం పెంపు వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి ఏడుకొండల వెంకటేశం గారిని రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆయన ఎన్నుకోబడటం పట్ల సమావేశంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.సంఘ అభివృద్ధి,సభ్యుల సంక్షేమం, వృత్తిదారుల హక్కుల సాధనలో శ్రీ వెంకటేశం చురుకైన నాయకత్వం ప్రదర్శిస్తారని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.కొత్త బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తానని,ప్రతి సభ్యుడికి న్యాయం జరిగేలా కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బండారు బిక్షపతి, సలహా దారులు రామచంద్రయ్య, ఈ.ఎన్. అశోక్, ఉపాధ్యక్షులు ఓదెల చందర్ రావు కొత్తపల్లి బుచ్చన్న,సాయిలు, వీరేశం కార్యదర్శులు నాగపూర్ నగేష్,రాధారపు బిక్షపతి సహాయ కార్యదర్శులు జిల్లెల శంకరయ్య కొత్తపల్లి జయసింహ పాల్గొన్నారు. అలాగే రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ కృష్ణయ్య ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్యాం కుమార్,వృత్తిదారుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు గుండాల గోవర్ధన్ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి మల్లెల ఉషారాణి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు,ఖమ్మంపాటీ సత్యనారాయణ,రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీరయ్య,నిమ్మలూరి శ్రీనివాస్ ,కార్యనిర్వాహక కార్యదర్శులు చందూర్ బాబు,ఆవునూరి రామన్న అన్నాజీపేట సాయిలు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశం ద్వారా సంఘ ఐక్యత మరింత బలపడినదని, భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు.

## పెరుగు తినమన్నందుకు ఇల్లాలు అదృశ్యం : కేపీహెచ్‌బీలో కేసు నమోదు



వార్తా సంధ్య కూకట్‌పల్లి: తిండి అలవాట్లపై భర్త చేసిన సూచన మనస్తాపానికి గురిచేయడంతో ఓ వివాహిత ఇంట్లోంచి వెళ్ళిపోయిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోరకొండకు చెందిన దాసరి శివకుమార్ (21), కెపిహెచ్‌బి కాలనీలోని షంషీగూడలో నివాసం ఉంటున్నాడు. ఇతడు డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శివకుమార్‌కు 2024 మే 28న రాజేశ్వరి (21)తో వివాహం జరిగింది. శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం అతను తన భార్యతో మాట్లాడుతూ "నువ్వు చాలా బక్కగా ఉన్నావు, ఆరోగ్యంగా ఉండటానికి పెరుగు తినడం అలవాటు చేసుకో" అని చెప్పాడు. ఈ చిన్న మాటను మనసులో పెట్టుకున్న రాజేశ్వరి, అప్పటి నుండి భర్తతో సరిగ్గా మాట్లాడటం లేదు. శుక్రవారం ఉదయం 7 గంటలకు శివకుమార్, అతని తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఉదయం 10:20 గంటల సమయంలో తండ్రి ఇంటికి తిరిగి వచ్చి చూడగా, తాళం వేసి ఉంది. శివకుమార్ వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించగా, రాజేశ్వరి తన బట్టలు తీసుకొని వెళ్ళిపోయినట్లు గుర్తించారు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ అవినాష్ బాబు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. రాజేశ్వరి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## బండి రమేష్‌ను కలిసిన ప్రకాశ్‌నగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ నూతన కార్యవర్గం



వార్తా సంధ్య కూకట్‌పల్లి : ప్రకాశ్‌నగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన మోహిత్ బీసా మరియు వారి బృందం శుక్రవారం కూకట్‌పల్లి ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేసిన నూతన కార్యవర్గాన్ని బండి రమేష్ గ ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.


**నూతన కార్యవర్గ సభ్యులు:** అధ్యక్షుడు: మోహిత్ బీసా వర్కింగ్ ప్రెసిడెంట్: ఎం.డి. యాసీన్ వైస్ ప్రెసిడెంట్లు: పి. రాహుల్, ముజమ్మిల్ జనరల్ సెక్రటరీ: నితిన్ సెక్రటరీ: సమీర్ కష్టపడి పనిచేయాలని పిలుపు: ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, యువత పార్టీకి వెన్నెముక వంటివారని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాడాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఆయన మార్గదర్శనం చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ డివిజన్‌లో పార్టీ జెండాను ఎగురవేయాలని మోహిత్ బీసాకు సూచించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు సలీమ్ కూడా పాల్గొని యువ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విశాల్ సుదాం, జయం చంద్రశేఖర్, చిరంజీవి, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో రూ.71 కోట్ల ఆర్ఓబి ప్రారంభం

శాస్త్రిపురంలో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ ప్రారంభం

ఫలక్‌నుమా డిపో నుంచి మైలార్ దేవ్‌పల్లి వరకు 4 లైన్ రోడ్డు ప్రారంభం

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్ బాబు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, వార్త సంధ్య : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరొక ముఖ్య అడుగు పడింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లతో కలిసి శాస్త్రిపురంలో రూ.71 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబి)ను ప్రారంభించారు. అలాగే ఫలక్‌నుమా బస్ డిపో నుండి మైలార్ దేవ్‌పల్లి వరకు 490 మీటర్ల పొడవైన నాలుగు లైన్ల రోడ్డును కూడా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "ఓల్డ్ సిటీ అనే పదాన్ని మానుకుని ఒరిజినల్ సిటీగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న హైదరాబాద్‌ను దేశంలోనే అత్యుత్తమ అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక సదుపాయాలతో మహానగరంగా తీర్చిదిద్దడం మా లక్ష్యం" అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కోట్లాది రూపాయల నిధులతో హైదరాబాద్ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, ముఖ్యంగా పర్యాటక రంగాన్ని దృష్టిలో ఉంచుకుని నగరాన్ని రూపుదిద్దుతున్నామని చెప్పారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుతూ, ప్రణాళికాబద్ధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ రత్నాకర్, ఎస్ఈ మోహన్ రెడ్డి, డీఈఈ సంపత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గంటా రామకృష్ణకు "దళితరత్న" బిరుదు ప్రదానం

అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సత్కారం

దళిత ఉపకులాల హక్కుల కోసం చేసిన కృషికి గుర్తింపు

పోరాటాన్ని మరింత బలంగా కొనసాగిస్తానని రామకృష్ణ



హైదరాబాద్/ అమరావతి, వార్త సంధ్య : డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ అత్యంత వెనుకబడిన ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గంటా రామకృష్ణకు "దళితరత్న" బిరుదుతో సత్కరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి దళిత ఉపకులాల సమస్యలపై, దళిత సాహిత్యం అభివృద్ధిపై, అలాగే అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తి చేయడంలో గంటా రామకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి ఈ గౌరవం అందజేశారు. ఎస్సీ 57 అత్యంత వెనుకబడిన ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ బాబు జగ్జీవన్ రావు - డా. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ వైస్ ఛైర్మన్ బైరి వెంకటేశం సిఫార్సు మేరకు తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా గంటా రామకృష్ణ మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ప్రేరణతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం, కుల ధృవపత్రాల జారీ లో జాప్యం, అభివృద్ధి కార్యక్రమాలు అందకపోవడం వంటి సమస్యలపై పోరాటాన్ని మరింత బలంగా కొనసాగిస్తానని తెలిపారు. "దళితరత్న" అవార్డు ప్రదానం చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, అలాగే ఎస్సీ ఉపకులాల సమస్యలపై జాతీయ స్థాయిలో ఉద్యమం చేస్తున్న బైరి వెంకటేశంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జూన్ 2లోపు పీఆర్సీ ప్రకటించాలి: రంగారెడ్డి జిల్లా జేఏసీ




## నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన

## 51% ఫిట్‌మెంట్‌తో వెంటనే పీఆర్సీ అమలు డిమాండ్

## సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణకు పిలుపు


**రంగారెడ్డి జిల్లా బ్యూరో, వార్త సంధ్య :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఇజేఏసీ ) సమరశంఖం పూరించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లాలోని అన్ని మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ డాక్టర్ కే. రామారావు మాట్లాడుతూ, 2వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 నెలలు గడిచినా ఇప్పటివరకు నివేదిక రాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వెంటనే నివేదికను విడుదల చేసి, 51 శాతం ఫిట్‌మెంట్‌తో జూన్ 2లోపు పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.13,000 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగులు మరియు పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం ( ఈహెచ్ఎస్)ను అమల్లోకి తీసుకురావాలని కోరారు. నగదు రహిత వైద్య సేవలను వెంటనే అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ( సిపిఎస్ )ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ( ఓ పి ఎస్ )ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ వర్తింపజేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15.25 లక్షల ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నాలుగు ప్రధాన డిమాండ్లతో పాటు ఇతర 64 పెండింగ్ అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించింది. తదనంతరం జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి మెమోరాండం సమర్పించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ డా. కే. రామారావుతో పాటు శ్రీనేష్ కుమార్ నోరి, మహేందర్ రెడ్డి, ప్రవీణ్, గోపాల్ నాయక్, పూర్ణచందర్, శాంతిశ్రీ, సైదమ్మ, రాకేష్, యశ్వంత్, అనిత, అలివేలు, రమేష్, వెంకటస్వామి, రంగయ్య, మసూద్ అలీ, నరసింహ, విశ్వనాథం, సుధాకర్, నరసయ్య, గాలయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, జీవన్, కృష్ణారెడ్డి, జగన్మోహన్, రాఘవేందర్, శేఖర్ రెడ్డి, పాండు, యాదగిరి, రాములు, రాజు, బాలకృష్ణ, గోవర్ధనాచారి, చంద్రయ్య, లక్ష్మయ్య, డేవిడ్, మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి

**ఇక రయ్‌మంటూ దూసుకెళ్లొచ్చువైరా, ఖమ్మం వరకు ఈ నెలాఖరు నాటికి పూర్తి కానున్న పనులు**

**మొత్తం పనులు పూర్తి అయ్యాక అధికారికంగా ప్రారంభంకానున్న హైవే**

**విశాఖ, హైదరాబాద్ మధ్య ప్రయాణ దూరం తగ్గిందని హర్షం**



తెలుగు రాష్ట్రాలకు కొత్త జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం-దేవరపల్లి 365 బీజీ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ట్రయల్ రన్‌లో భాగంగా వాహనాల రాకపోకలకు అనుమతివ్వడంతో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. 100 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం : విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య దూరాన్ని తగ్గించేందుకు చేపట్టిన ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు 2022లో ప్రారంభమయ్యాయి. 4 వేల 451 కోట్లతో 162 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 365 బీజీ నేషనల్ హైవే పేరిట పచ్చని పొలాల మధ్య నాలుగు వరుసల రహదారి నిర్మించారు. దేవరపల్లి నుంచి తెలంగాణలోని వైరా వరకు పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులు ట్రయల్ రన్‌కు అనుమతించారు. సోమవారం నుంచి నాలుగు వరుసల రహదారిపై భారీ వాహనాలు దూసుకుపోతున్నాయి. కార్లు 100 కిలోమీటర్లు, ఇతర వాహనాలు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణానికి అవకాశం కల్పించారు. ఈ కొత్త రహదారిపై ప్రయాణం సుఖవంతంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు."ఖమ్మం-దేవరపల్లి రహదారి చాలా బాగుంది. ఇంతకు ముందు పట్టినంత సమయం ఇప్పుడు ప్రయాణానికి అంతగా పట్టడం లేదు. ఇంతకు ముందు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ రోడ్ వేసినందుకు చాలా సౌకర్యవంతంగా ఉంది. గేర్లు మార్చేందుకు ఇంతకు ముందు ఉన్నంత ఇబ్బంది ఇప్పుడు లేదు. ఈ రహదారి కారణంగా మూడు గంటలు పట్టే ప్రయాణం కూడా గంట తేడాతో రెండు గంటలు మాత్రమే పడుతుంది. వాహనాలకు మైలేజ్ కూడా బాగా వస్తుంది. రహదారి లేనందువల్ల ఇంతకు ముందు ఊరు లోపల నుంచి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఈ రహదారి కారణంగా ఇప్పుడు అలాంటి ఇబ్బందులు ఏమీ లేవు. ప్రయాణం చాలా సాఫీగా సాగిపోతుంది." -ప్రయాణికులు

**ఇరువైపులా 8 వరుసలు :** రహదారిపై సాంకేతిక పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాతీయ రహదారిపైకి ఎక్కేచోట్ల, దిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టోల్ గేట్ల వద్ద సీసీ కెమెరాలు, ఫాస్టాగ్‌కు సంబంధించిన పరికరాలు అమర్చుతున్నారు. దేవరపల్లి టోల్ గేట్ల వద్ద ఇరువైపులా 8 వరుసలను ఏర్పాటు చేశారు. వాహనదారులు టోల్ రుసుము చెల్లించేటప్పుడు సమయం వృథా కాకుండా చేస్తున్న ఏర్పాట్లు చివరి దశకు చేరాయి.

**వాహనాలకు ఇంటర్ ఛేంజ్‌లుగా వీలు :** 365 బీజీ గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఎంత దూరం ప్రయాణిస్తే ఆ మేరకు మాత్రమే టోల్ వసూలు చేస్తారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నేపథ్యంలో ఇంటర్ ఛేంజ్‌లుగా వీలు కల్పించిన ప్రదేశాల వద్ద ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాల నుంచి మాత్రమే రహదారిపైకి రావడానికి, దిగడానికి అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో దేవరపల్లి, పొంగుటూరు, జంగారెడ్డిగూడెం సమీపంలోని పుట్లగట్టగూడెం, రేచర్ల వద్ద మాత్రమే వాహనాలు ఎక్కి, దిగడానికి రోడ్డు నిర్మించారు. వైరా నుంచి ఖమ్మం వరకు ఈ నెలాఖరు నాటికి మొత్తం పనులు పూర్తవ్వనున్నాయి. ఆ తర్వాత 365 బీజీ రహదారిని అధికారికంగా ప్రారంభించనున్నారు.

# మంగ్లీ కేసులో కీలక పరిణామం

**ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన రమావత్ మధు**

**రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం**

**33 మంది దగ్గర మొత్తం రూ.6.58 కోట్లు వసూలు**

**కీలక నిందితుడు రమావత్ మధును అరెస్టు చేసిన ఈవోడబ్ల్యూ పోలీసులు**

రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలను బురిడీ కొట్టించి, రూ.కోట్లలో మోసగించిన నిందితుడు రమావత్ మధును సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుభక్షేత్ర వెంచర్ పేరుతో 31 మంది వద్ద రూ.6.58 కోట్లు వసూలు చేసిన కేసులో మధు నిందితుడిగా ఉన్నాడు. గతేడాది నల్గొండ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో నమోదైన గోకులానంద ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మోసం కేసులోనూ రమావత్ మధునే కీలక నిందితుడు.

**ఈవోడబ్ల్యూలో నమోదైన కేసు వివరాల ప్రకారం :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు జేపీ కాలనీకి చెందిన కత్రిక సంతోశ్ (33) అనే వ్యక్తి వ్యాపారి. అతనికి ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన బండి శివకుమార్, సంగారెడ్డికి చెందిన రమావత్ మధు, రమావత్ సక్రులు పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ కలిసి సంయుక్తంగా ఓ పెట్టుబడి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లుగా ప్రచారం మొదలుపెట్టారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని దామరగిద్ద గ్రామంలో 16 ఎకరాల్లో శుభక్షేత్ర వెంచర్ ప్రారంభిస్తున్నట్లు అందరికీ వివరించేవారు. ఇదే పేరుతో మియాపూర్‌లో ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ స్కీమ్‌లో భాగంగా ఎవరైనా రూ.5 లక్షలు, అంతకంటే ఎక్కువ డబ్బు కడితే తాము ప్రారంభించే వెంచర్‌లో 102 చదరపు గజాల స్థలాన్ని రిజిస్టర్ చేస్తామని, అదనంగా రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు 42 నెలల పాటు రూ.25 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పారు. వారు చెప్పిందంతా నిజమేనని భావించిన కత్రిక సంతోశ్ సెప్టెంబర్ 2025లో రూ.5 లక్షలు చెల్లించాడు. అతడిలాగే మరో 33 మంది మొత్తం రూ.6.58 కోట్లు కట్టారు. ఈ ఘటన జరిగి దాదాపు ఆరు నెలలు గడిచినప్పటికీ శివకుమార్, మధు, సక్రు ప్లాట్లను మాత్రం రిజిస్టర్ చేయలేదు. నెలవారీగా ఇవ్వాల్సిన రూ.25 వేలు చెల్లించడం లేదు. దీనిపై ప్రశ్నించగా ఆఫీసు దగ్గర బౌన్సర్లను పెట్టి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

**సింగర్ మంగ్లీపైనా కేసు :** తాజాగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది సింగపోగు సుబ్బారావు ఫిర్యాదుతో నమోదైన కేసులోనూ రమావత్ మధు నిందితుడిగా ఉన్నారు. ప్రముఖ గాయని మంగ్లీ, రమావత్ మధు, శైలజా చౌహాన్, భరత్ చౌహాన్, శివ తదితరులు 100-150 మంది దగ్గర పెట్టుబడులకు అధిక లాభాల పేరిట రూ.10 కోట్ల వరకూ వసూలు చేశారని సుబ్బారావు మార్చి 27న ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగ్లీ సహా మిగిలిన వారిపై కేసులు నమోదు చేశారు.

**ఇదీ కేసు నేపథ్యం :** గోకులనంద ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఫ్రాడ్ కేసులో రమావత్ మధు నిందితుడు. తమ సంస్థలో పెట్టుబడులు పెట్టినట్లయితే అధిక లాభాలను ఇప్పిస్తామంటూ దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి రూ.కోట్లలో వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై పీఏపల్లి పోలీస్ స్టేషన్‌లో మధు సహా 9 మందిపై కేసు నమోదైంది. ఇది భారీ మోసం కేసు కావడంతో సీఐడీకి బదిలీ అయ్యింది. తాజాగా నిందితుడు రమావత్ మధును ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు.



**ఆఫర్లు చూసి మోసపోవద్దు :** రియల్ ఎస్టేట్ రంగంలో ఇలాంటి నమ్మశక్యం కాని ఆఫర్లను చూసి ప్రజలు మోసపోవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదైనా వెంచర్‌లో పెట్టుబడి పెట్టేముందు చట్టపరమైన అనుమతులు సహా అన్ని వివరాలు సరిచూసుకోవాలని సూచిస్తున్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

## యూడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

**:ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**హయత్ నగర్ వార్తా సంధ్య ప్రతినిధి, ఏప్రిల్ 17:** సుధీర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన యూడిఐడి కార్డుల పంపిణి కార్యక్రమం సుధీర్ రెడ్డి చేతుల మీదుగా పలువురు దివ్యాంగులకు పంపిణి చేయడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అంగవైకల్యంతో బాధపడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యుడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైతన్యపూరి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,శివప్రకాష్,గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల అధ్యక్షులు మందా బిక్షపతి యాదవ్,ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు వర్కాల భాగ్యలక్ష్మి,సిద్ధం నర్సింగ్,పద్మ,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం మాజీ తాజా కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ని కలిసిన అసోసియేషన్ అధ్యక్షులు



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, ఏప్రిల్ 17:** గత రెండు మూడు రోజుల కాలంగా వేసవి కాలం తాగునీటి సమస్య కారణంగా వెంకటరమణ కాలనీ. అభ్యుదయ నగర్, ఆర్టీసీ కాలనీ, శక్తి నగర్ కాలనీ కాలనీలో తాగునీటి సమస్య రెండు మూడు రోజుల నేపథ్యంలో అన్ని కాలనీ అసోసియేషన్, ప్రెసిడెంట్లు ని కలిసి సమస్యను వివరించారు. ఈ విషయాన్ని స్పందించిన వనస్థలిపురం డివిజన్ మాజీ తాజా కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి అన్ని కాలనీలో ప్రెసిడెంట్లు వచ్చి కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రాగుల వెంకటేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులైన డీజీఎం, ఏఈ కి ఈ సమస్యను తెలియజేశారు. దీనితో వెంకటరమణ కాలనీ,అభ్యుదయ నగర్ కాలనీ, శక్తి నగర్ కాలనీ మరియు ఆర్టీసీ కాలనీ కి డీజీఎం నాగరాజు, ఏఈ శ్రీ భాను, ప్రియాంక వారి సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, మరియు గంగిరెడ్డి, క్రిస్టియన్ కాలనీ హరేందర్ రెడ్డి, యాదవ రెడ్డి, రాజేష్,అజయ్, ఆర్టీసీ కాలనీ ముకుంద రాజు తడితరులు పాల్గొన్నారు

## వనస్థలిపురం కమలా నగర్ కమ్యూనిటీ హాల్ లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,ఏప్రిల్ 17:** శుక్రవారం ఉదయం కమలానగర్ కమ్యూనిటీ హాల్ నందు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ ప్రోగ్రాం ను జరిగింది. ఇందులో రోడ్డు ఆక్సిడెంట్ లో గోల్డెన్ హౌర్, దాని ప్రాముఖ్యత గురించి మరియు హెల్మెట్/ సీట్ బెల్ట్ వాడకం, డ్రంకెన్ డ్రైవింగ్ ప్రమాదాలు, సెల్ ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ మరియు ఇతర ట్రాఫిక్ రూల్స్ వివరించడం జరిగింది. ఈ ప్రోగ్రాంలో ఎల్. బి. నగర్ అడిల్. డీసీపీ కోటేశ్వర్‌రావు, వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ రవిబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఎస్ఐలు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ ఆలం, ప్రగ్మా హాస్పిటల్ డాక్టర్స్ మరియు స్టాఫ్,నేలపాటి రామారావు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరియు ఇతర నాయకులు, కమలానగర్ అసోసియేషన్ వారు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట రాములోరి హుండీ లెక్కింపు

**ఒంటిమిట్ట రాములోరి ఆలయంలో హుండీ లెక్కింపు**

**మొత్తం రూ.29,00,205 వరకు ఆదాయం వచ్చినట్లు వెల్లడించిన ఆలయ అధికారి నవీన్ కుమార్**

**నెలరోజుల వ్యవధిలోనే ఈ స్థాయిలో రావడం ఇదే తొలిసారని వివరణ**




వైఎస్సార్ కడప జిల్లాలో ఒంటిమిట్ట కోదండరామ స్వామివారి దేవాలయంలో హుండీ లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఈ లెక్కింపులో భాగంగా దాదాపు రూ.29,00,205 వరకు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్ కుమార్ ఈ సందర్భంగా వెల్లడించారు. అయితే ఆలయంలోని రంగ, ముఖ మండపం, భక్త సంజీవరాయ స్వామి ఆలయంలో హుండీలను తెరిచి లెక్కించారు.అంతేకాకుండా టీటీడీ పరిపాలన అదే విధంగా విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణలో శ్రీవారి సేవకులు ఈ హుండీ లెక్కింపును ప్రారంభించారు. అదే విధంగా మార్చి 26 నుంచి ఈ నెల 5 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరాముడి దర్శన భాగ్యం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అందరి ఆరాధ్య దైవమైన జగదభిరాముడిని దర్శించుకున్న అనంతరం భక్తులు హుండీల్లో కానుకలను వేశారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఆలయానికి రూ. 29 లక్షల వరకు ఆదాయం సమకూరడం గడిచిన గత పది సంవత్సరాల కాలంలో ఇదే తొలిసారని ఆలయ అధికారులు పేర్కొనడం గమనార్హం.

**అంకురార్పణతో ప్రారంభం:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఏప్రిల్ 5 వరకు వైభవంగా జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజైన మార్చి 31వ తేదీ ఉదయం మోహినీ అలంకారంలో రాములవారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చారు. ఆ రోజు ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కేరళ డ్రమ్స్, కోలాటాలు, భక్తజన బృందాలు చెక్క భజనలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వాహన సేవలో ఆలయ డిప్యూటీ ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**2,500 మంది పోలీసులతో భద్రత:** కల్యాణానికి లక్ష మంది భక్తులు వస్తారనే అంచనాతో టీటీడీ ఏర్పాట్లు చేయగా ఆ స్థాయిలోనే భక్తులు ఒంటిమిట్టకు రావడం గమనార్హం. అంతేకాకుండా గ్యాలరీల్లో కూర్చునే భక్తులకు తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు, మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లతో పాటు తిరుమల శ్రీవారి లడ్డూను కూడా ఉచితంగా అందించారు. అదే విధంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు మొత్తం 2,500 మంది పోలీసులతో భద్రతను కల్పించారు. స్వామివారి కల్యాణానికి ముందు ఒంటిమిట్ట ఆలయం నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర లక్షలాది భక్తజన సందోహం నడుమ కోలాహలంగా సాగింది.

# పడక గది పచ్చగా..



పడక గది పచ్చగా కళకళలాడాలంటే.. కుండీల్లో మొక్కలను పెంచుకోవాల్సిందే! కాకుంటే.. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే సూర్యరశ్మి కావాల్సిందే! అలాంటప్పుడు సూర్యరశ్మి అవసరం లేని మొక్కలను ఎంచుకుంటే చాలు. కొన్ని మొక్కలు తక్కువ కాంతిలోనే చక్కగా పెరుగుతాయి. కాబట్టి, బెడ్రూములోనూ వాటిని భేషుగ్గా పెంచుకోవచ్చు.

**ఫిలోడెండ్రాన్ ప్లాంట్ :** గాలిని శుద్ధి చేయడంలో ఈ మొక్క సమర్థంగా పనిచేస్తుంది. కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇల్లు కట్టుకున్నవారికి ఈ మొక్క వరంలాంటిదే! దీన్ని కుండీలో పెంచుకొని.. పడగ గదిలో ఓ మూలన పెట్టేస్తే చాలు. తగినంత సూర్యరశ్మి లేకున్నా.. చక్కగా పెరుగుతుంది. గాలిని శుద్ధి చేస్తుంది. దీన్ని పెంచడం కూడా చాలా సులభం. చీడపీడలు సోకే అవకాశం కూడా ఉండదు. తగినన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

**సింగోనియం ప్లాంట్ :** దీనికే 'యారోహెడ్' అని పేరు. ఈ మొక్క ఆకులు బాణపు తలల్లా ఉంటాయి. కాబట్టే.. ఆ పేరొచ్చింది. ఇవికూడా సులభంగా పెరుగుతాయి. ఆక్సిజన్‌ను పుష్కలంగా అందిస్తుంది. గాలిని శుద్ధి చేస్తుంది. చిన్నచిన్న కుండీల్లోనూ చక్కగా పెరుగుతాయి. పడక గదికి కొత్త అందాన్ని తీసుకొస్తాయి.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?

**రోజూ ఇలా ట్రై చేస్తే మంచిదంటున్న నిపుణులు!**

**బరువును అదుపులో పెట్టుకోవడం పెద్ద కష్టమేమీ కాదట!**

**ఏం చేయాలో వివరిస్తున్న నిపుణులు!**



బరువు తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి కాస్త సమయం పడుతుంది. డైటింగ్, చక్కటి పోషకాహారం తీసుకోవడం, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువుతో డయాబెటిస్, హైబీపీ వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరగడంతో పాటు కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుందని పేర్కొంటున్నారు. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదంటున్నారు. దీనికీ ఒక పద్ధతి ఉందని సూచిస్తున్నారు. మరి, అదెంటో ఇప్పుడు తెలుసుకుందాం!శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల అదనపు శక్తి కొవ్వుగా మారి, బరువు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రకరకాల అంశాలు దీనికి కారణమవుతుంటాయని అంటున్నారు. అలాగే, బరువు పెరగటంలో కొన్ని రకాల జన్యువులు, మందులూ దీనికి దోహదం చేయొచ్చని పేర్కొంటున్నారు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదని, చిన్న చిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపుతాయని వెల్లడిస్తున్నారు.

**లెక్క ప్రకారం :** శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి ఆధారంగా బరువును లెక్కిస్తారు. ఇది 18.5-24.9లోపు ఉండటం మంచిదని, 25 నుంచి 29.6 మధ్యలో ఉంటే అధిక బరువుగా.. 30, అంతకన్నా ఎక్కువుంటే ఊబకాయంగా పరిగణిస్తారని %చీ×న% అధ్యయనం పేర్కొంది. బరువును లెక్కించటానికి తేలికైన, సత్వర మార్గమే అయినప్పటికీ, ఇందులో కొవ్వు మోతాదు కచ్చితంగా తెలియదంటున్నారు నిపుణులు. శరీరంలోని నీరు, కండరాలు, ఎముకల బరువులన్నీ బీఎంఐలో కలిసే ఉంటాయని చెబుతున్నారు. వాస్తవానికి, ఎక్కువ ప్రమాదం అధిక కొవ్వుతోనే అని తెలియజేస్తున్నారు. దీని మూలంగా పెరిగినట్టయితే నెమ్మదిగా, వారానికి 450 నుంచి 900 గ్రాముల వరకు తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. కొందరు త్వరగా బరువు తగ్గటం మంచిదని అనుకుంటారు. కానీ, ఎంత త్వరగా తగ్గితే అంతే వేగంగా పెరిగే ప్రమాదముంటుందని వివరిస్తున్నారు. నెమ్మదిగా, క్రమంగా తగ్గే బరువు స్థిరంగా కొనసాగుతూ వస్తుందని పేర్కొంటున్నారు.

**ఆహారం విషయంలో :** బరువు తగ్గటానికి.. ఆహారం ద్వారా లభించే కేలరీలను తగ్గించుకోవటంతో పాటు కేలరీలు ఎక్కువ ఖర్చయ్యేలా శారీరక శ్రమ చేయటం తప్పనిసరంటున్నారు నిపుణులు. రోజులో శరీరం ఖర్చు చేసే కేలరీల కన్నా సుమారు 500 తక్కువ కేలరీలు తీసుకుంటే బరువు తగ్గుతారని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో వారానికి సుమారు 900 గ్రాముల బరువు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. కాబట్టి కేలరీలు ఎక్కువగా ఉండే పదార్థాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్‌ఫ్యాట్స్ తగ్గించుకోవాలని సలహా ఇస్తున్నారు. రోజూ రకరకాల కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పాల పదార్థాలు.. మాంసాహారులైతే చికెన్, చేపల వంటివన్నీ సమపాళ్లలో తీసుకోవటం ముఖ్యమంటున్నారు నిపుణులు. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఆయా పదార్థాలను ఎంచుకుంటే మధ్యలో కట్టు తప్పకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. శారీరక శ్రమను పెంచడం, ఆహారపు అలవాట్లను మార్చడం ద్వారా కేలరీలు తీసుకోవడం తగ్గించుకోవాలని %చీఖ్ఱశీఙఖ్రీ ూఱఎత్ఖుతీఎ శీట వీవఎఱఎఱఅవ% అధ్యయనం పేర్కొంది.ఈ క్రమంలో కేలరీలను లెక్కించుకొని తినటం ఎలా సాధ్యమని చాలామంది అనుకుంటారు. కానీ, మితంగా తినేలా చూసుకుంటే చాలావరకు కేలరీలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న పళ్లాన్ని ఎంచుకుంటే వడ్డించుకునే పదార్థాల పరిమాణమూ తగ్గుతుందంటున్నారు. అలాగే ఆహారాన్ని పూర్తిగా నములుతూ, ఆస్వాదిస్తూ తినటం మంచిదని, గబగబా మింగేస్తే కడుపు నిండిన విషయం మెదడుకు తెలియదని పేర్కొంటున్నారు. దీంతో మరింత ఎక్కువ తినే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

**శ్రమ సాయం :** క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వల్ల బరువు, రక్తపోటు, ఒత్తిడి తగ్గుతుందని %ూావివతీఱఙ్ఖఅ ఎఙఖతీ-ూాంశీఎఱఖ్ఱశీఅ% అధ్యయనం పేర్కొంది. గుండె, శ్వాస వేగాలను పెంచే వ్యాయామాలైతే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వేగంగా నడవటం, ఈత కొట్టటం, డ్యాన్స్ చేయటం వంటివన్నీ బరువు తగ్గడానికి దోహదం చేస్తాయంటున్నారు. ఎంత మంచివైనా వ్యాయామాలను ఒకేసారి వేగంగా చేయకూడదని, క్రమంగా వేగం పెంచుకుంటూ రావాలని సూచిస్తున్నారు. బద్ధకంగా కూర్చోవటానికి బదులు తేలికైన వ్యాయామాలైనా చేయాలని, వీటితోనూ కేలరీలు ఖర్చవుతాయని పేర్కొంటున్నారు. లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కటం, అప్పుడప్పుడూ లేచి కాసేపు నడవటం వంటి చిన్న మార్పులైనా మంచి ఫలితం చూపిస్తాయని సలహా ఇస్తున్నారు. బరువులు ఎత్తటం వంటి కండరాలను దృఢం చేసే వ్యాయామాలనూ మరవరాదని, పెద్దవాళ్లు వారానికి కనీసం రెండు రోజులైనా ఇలాంటివి సాధన చెయ్యాలని పేర్కొంటున్నారు.

# షుగర్ పేషెంట్స్ 'సీతాఫలం' తినొచ్చా?

**సీతాఫలంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు - గుండె పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణుల వెల్లడి!**



ప్రకృతి ప్రసాదించే అద్భుతమైన పండ్లలో సీతాఫలం ఒకటి. ఆపిల్ రంగూ, మామిడి రుచీ లేని కొండ పండు ఇది. అయితే ఎంత తిన్నా తనివి తీరని ఈ పండు ఎన్నో అనారోగ్యాల్ని నయం చేస్తుందంటున్నారు నిపుణులు. సీతాఫలంలో ఉండే ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు అనేవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహకరిస్తాయని చెబుతున్నారు. మరి డయాబెటిస్?తో ఇబ్బందిపడేవారు ఈ పండ్లను తినొచ్చా? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.

**రోగనిరోధక శక్తి పెరుగుదల :** సీతాఫలంలో ఎ, సి, బి6 వంటి విటమిన్లతో పాటు కాపర్, పొటాషియం, పీచు వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా లభిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్ సి అనేది రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుందని The Pharma Innovation Journal ప్రచురించింది. అలాగే, ఇందులోని యాంటీ ఇన్?ఫ్లమేటరీ గుణాలు శరీరంపై ఏర్పడిన వాపును తగ్గించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు.

'గుండెకు' ముప్పు తెచ్చే అలవాట్లు ఇవే! - వీటికి దూరంగా ఉండాలంటున్న నిపుణులు

**గుండె ఆరోగ్యానికి :** సీతాఫలంలో అధిక మెగ్నీషియం కంటెంట్ మృదువైన గుండె కండరాలను సడలించి, స్ట్రోక్, గుండెపోటును నివారిస్తుందని అధ్యయనం పేర్కొంది. ఇందులోని ఫైబర్, నియాసిన్ శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**షుగర్ కంట్రోల్ :** ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల చక్కెర శోషణ నెమ్మదిగా జరుగుతుందంటున్నారు నిపుణులు. తద్వారా టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. సీతాఫలంలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుందని, ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్స్? డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. అయితే మరీ ఎక్కువ మొత్తంలో కాకుండా మితంగా, డాక్టర్ల సూచన మేరకు తినాలని చెబుతున్నారు.

**గర్భిణులకు :** గర్భం దాల్చిన మహిళల్లో వేవిళ్లు, మూడ్ స్వింగ్స్?, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం లాంటి సమస్యలు కామన్?. అయితే వీటిని సీతాఫలంతో చెక్ పెట్టొచ్చంటున్నారని నిపుణులు. ఇందులో కాపర్ ఎక్కువ మొత్తంలో లభిస్తుందని, దీంతో శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు. అంతేకాకుండా, పిండం అభివృద్ధిలో సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. గర్భాధారణ సమయంలో సీతాఫలం తినడం వల్ల, పుట్టబోయే శిశువు మెదడు, నాడీ వ్యవస్థ, రోగనిరోధక శక్తి అభివృద్ధికి తోడ్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో గర్భిణులకు కాపర్ తక్కువైతే పూర్తిగా నెలలు నిండకుండానే బిడ్డ పుట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీరు సీతాఫలం తినడం మంచిదని సూచిస్తున్నారు.

**బరువు అదుపులో :** సీతాఫలంలో కొవ్వులు, క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అలాగే, ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగేలా చేస్తుందంటున్నారు నిపుణులు. దీంతో ఎక్కువ సమయం ఆకలేయకుండా, చిరుతిండ్ల జోలికి పోకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. తద్వారా క్రమంగా బరువు తగ్గచ్చని సూచిస్తున్నారు. ఇందులో ఉండే విటమిన్ బి6 కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్లు వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుందని పేర్కొంటున్నారు.

**పీసీఓఎస్ ఉన్నవారు :** పీసీఓఎస్ ఉన్న వారిలో హార్మోన్ల అసమతుల్యత కారణంగా అలసట, నీరసం, మూడ్ స్వింగ్స్, చికాకు వంటివి సర్వసాధారణంగా ఉంటాయి. అయితే వీటన్నింటికీ ఐరన్ విరుగుడుగా పనిచేస్తుందని, సీతాఫలంలో అది ఎక్కువగా లభిస్తుందని అంటున్నారు నిపుణులు. కాబట్టి, పీసీఓఎస్ ఉన్న వారూ ఈ పండు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే, ఇది సంతాన సాఫల్యతను సైతం పెంచుతుందని తెలియజేస్తున్నారు.

**ఇవీ కూడా :**

ఈ పండులో ఉండే కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి.ఇందులో బి- కాంప్లెక్స్ అధికంగా ఉండటం వల్ల మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది.ఈ పండులో విటమిన్ రైబోఫ్లేవిన్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్?తో పోరాడి కంటిచూపును మెరుగుపరచడంతో పాటు కంటి సమస్యల్ని నివారిస్తాయి.సీతాఫలంలో అధికంగా ఉండే డైటరీ పీచు పదార్థం జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.అయితే సీతాఫలం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది కదా అని ఎక్కువగా తినడం కూడా శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. అలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ పండు మోతాదు విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే నిపుణుల్ని అడిగి తెలుసుకోవడం మంచిదంటున్నారు.

# ధనియాలతో నీళ్లను ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!

జశీతీఖుఅనవతీ ూవవనం ఔఫవతీ% ఎ ధనియాలను మనం వంటి ఇంటి మసాలా దినుసులుగా ఎప్పటినుంచో ఉపయోగిస్తున్నాం. అయితే ఆయుర్వేద ప్రకారం ఈ దినుసులు అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. పలు ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ ధనియాలను ఉపయోగిస్తారు. అలాగే మసాలా వంటకాల్లోనూ వీటిని వాడుతారు. అయితే కేవలం రుచి, వాసనను అందించడమే కాదు, మనకు ఇవి ఆరోగ్య ప్రయోజనాలను కలగజేస్తాయి. ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలతో తయారు చేసే నీళ్లను తాగితే ఎంతో మేలు జరుగుతుందని వారు చెబుతున్నారు. ధనియాల నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు తగ్గిపోతాయి.



### షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌కు..

ధనియాల నీళ్లను తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను బాగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ధనియాల నీళ్లను తాగితే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. వీటిల్లో క్వర్సెటిన్, టెర్పినైన్, టోకోఫెరాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ధనియాల నీళ్లను తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె సురక్షితంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### ఏ సమయంలో తాగాలి..?

బరువు తగ్గాలనుకునే వారు, లివర్ వ్యాధులు ఉన్నవారు, చర్మ సమస్యలకు కూడా ధనియాల నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. ధనియాల నీళ్లను తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మోకాళ్లు, కీళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ధనియాల నీళ్లను తాగితే మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా మారుతారు. నీరసం, అలసట తగ్గిపోతాయి. ధనియాల నీళ్లను రోజూ ఉదయం పరగడుపునే తాగవచ్చు. లేదా భోజనం చేయడానికి 45 నిమిషాల ముందు తాగాలని ఆయుర్వేదం చెబుతోంది. ధనియాలను రాత్రి పూట నీటిలో నానబెడితే మరుసటి రోజు మొత్తం ఆ నీళ్లను కొద్ది కొద్దిగా కూడా తాగుతూ ఉండవచ్చు.

### ఇలా కూడా చేయవచ్చు..

ఇక ధనియాల నీళ్లను కేవలం ధనియాలను నానబెట్టి మాత్రమే కాదు, ధనియాలను నీటిలో వేసి మరిగించి కూడా తయారు చేయవచ్చు. ఇలా ఏ రకంగా అయినా సరే ధనియాల నీళ్లను తయారు చేసి తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ధనియాలు అనేక వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయని అంటున్నారు. అలర్జీలు ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు ధనియాల నీళ్లను తాగకూడదు.

# రోజూ దీన్ని 2 కప్పులు తాగితే చాలు.. చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!



రోజూ ఉదయం నిద్ర లేచిన దగ్గరి నుంచి రాత్రి మళ్లీ నిద్రించే వరకు చాలా మంది టీ, కాఫీలను అధికంగా తాగుతుంటారు. వాతావరణం చల్లగా ఉంటే టీ, కాఫీలు ఇంకా ఎక్కువగా తాగుతారు. అయితే టీ, కాఫీలకు బదులుగా హెర్బల్ టీలను తాగితే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని, దీంతోపాటు టీ, కాఫీ తాగిన ఫీలింగ్ కూడా కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఈ క్రమంలోనే మనకు తాగేందుకు అనేక రకాల హెర్బల్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కొంబుచా టీ కూడా ఒకటి. టీ, చక్కెర, బ్యాక్టీరియా, ఈస్ట్‌ను కలిపి పులియబెట్టి ఈ టీ పొడిని తయారు చేస్తారు. దీన్నే కొంబుచా టీ అంటారు. ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంబుచా టీని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని వారు అంటున్నారు.

### జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

కొంబుచా టీ అంటే పులియబెట్టబడింది కనుక ఈ టీని సేవిస్తే ప్రోబయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. అంటే ఈ టీ మన జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అజీర్తి తగ్గుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్దకం తగ్గిపోతుంది. విరేచనాలు, ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ (ఐబీఎస్) వంటి సమస్యలు ఉన్నవారు కొంబుచా టీని సేవిస్తుంటే ఉపశమనం లభిస్తుంది. కొంబుచా టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండడం వల్ల ఈ టీని సేవిస్తుంటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, వయస్సు మీద పడడం వల్ల వచ్చే జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చు.

### లివర్ ఆరోగ్యానికి..

కొంబుచా టీ లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజూ ఈ టీని తాగుతుంటే అందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్ కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో లివర్‌లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. లివర్ క్లీన్ అవుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య తగ్గుతుంది. లివర్ సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఈ టీ ఎంతగానో మేలు చేస్తుంది. ముఖ్యంగా మద్యం కారణంగా వచ్చిన ఫ్యాటీ లివర్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొంబుచా టీని తాగితే మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### డయాబెటిస్ ఉంటే..

ఈ టీని తాగుతుంటే షుగర్ లెవల్స్ సైతం తగ్గిపోతాయి. కొంబుచా టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కొంబుచా టీని తాగడం వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ టీ బరువును కూడా తగ్గించగలదు. దీన్ని తాగితే శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు త్వరగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు ఈ టీని డైట్‌లో కచ్చితంగా చేర్చుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా కొంబుచా టీని రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# భారత్‌కు భారీగా రష్యా చమురు దిగుమతులు

**మార్చిలోనే మూడు రెట్లు పెరుగుదల**

**భారత్‌కు గణనీయంగా పెరిగిన రష్యా చమురు దిగుమతులు**

**కొనుగోళ్లలో రెండో స్థానంలో భారత్**

**అమెరికా సడలింపులతో పెరిగిన కొనుగోళ్లు**



ముడి చమురు ధరల మంటలకు బ్రేక్ వేసేందుకు రష్యా వైపు భారత్ మరింత బలంగా అడుగులు వేస్తోంది. మార్చి నెలలో రష్యా నుంచి భారత్ చేసుకున్న ముడి చమురు కొనుగోళ్లు మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా మూడు రెట్లు పెరిగాయి. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) అనే సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఒకవైపు అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, మరోవైపు పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశీయ, అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో భారత్ వ్యూహం ఎలా ఉంటుందో చూద్దాం.ఫిబ్రవరిలో కాస్త తగ్గుముఖం పట్టిన రష్యా చమురు దిగుమతులు, మార్చి నాటికి మళ్లీ పుంజుకున్నాయి. సీఆర్ఈఏ నివేదిక ప్రకారం, మార్చిలో రష్యా నుంచి శిలాజ ఇంధనాలను అత్యధికంగా కొనుగోలు చేసిన దేశాల్లో భారత్ రెండో స్థానంలో నిలిచింది. మార్చి నెలలో ఏకంగా 5.8 బిలియన్ యూరోలవిలువైన రష్యన్ హైడ్రోకార్బన్‌లను భారత్ దిగుమతి చేసుకుంది. మార్చిలో రష్యా నుంచి భారత్ చేసుకున్న ముడి చమురు కొనుగోళ్లు మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా మూడు రెట్లు పెరిగాయి. ఇందులో కేవలం ముడి చమురు వాటానే 91 శాతంగా, అంటే సుమారు 5.3 బిలియన్ యూరోలుగా ఉంది. మిగిలిన వాటిలో బొగ్గు 337 మిలియన్ యూరోలు ఉండగా, ఇతర చమురు ఉత్పత్తులు 178.5 మిలియన్ యూరోలు ఉన్నాయి. ఫిబ్రవరిలో చూసుకుంటే, ఈ మొత్తం కొనుగోళ్లు 1.8 బిలియన్ యూరోలుగా మాత్రమే ఉండగా, మార్చి నాటికి అవి భారీగా పెరిగాయి.

**అమెరికా నిర్ణయం వల్లే**

రష్యా చమురు దిగుమతులు అకస్మాత్తుగా ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం అమెరికా తీసుకున్న ఒక నిర్ణయమేనని తెలుస్తోంది. ఇరాన్‌పై వాషింగ్టన్ యుద్ధం ప్రకటించిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఆ ధరలను అదుపు చేయడానికి, రష్యా చమురుపై అమెరికా ఒక నెల పాటు ఆంక్షల సడలింపు ఇచ్చింది. సముద్రంలో ప్రయాణిస్తున్న కార్గోలకు, అలాగే గతంలో ఆంక్షలు విధించిన నౌకలకు ఇది వర్తిస్తుందని పేర్కొంది. దీని వల్ల అంతకుముందు రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసిన మన దేశ ప్రభుత్వ రంగ రిఫైనరీలు, మళ్లీ కొనుగోళ్లను భారీగా ప్రారంభించాయి. ప్రభుత్వ రంగ రిఫైనరీల దిగుమతుల్లో నెలకు నెల ఏకంగా 148 శాతం భారీ పెరుగుదల కనిపించింది. గత నవంబర్ చివరలో రష్యా దిగుమతులను నిలిపివేసిన మంగళూరు, విశాఖపట్నం రిఫైనరీలు సైతం మార్చిలో మళ్లీ చమురు కొనుగోళ్లను పునరుద్ధరించాయి.

**రెండు స్థానంలో భారత్**

పశ్చిమదేశాల ఆంక్షల నేపథ్యంలో చమురు అమ్మకాల కోసం రష్యా ఆసియా మార్కెట్లపైనే తీవ్రంగా ఆధారపడుతోంది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో రష్యా ఎగుమతి చేసిన ముడి చమురులో 90 శాతం కేవలం చైనా, భారత్‌లకే చేరడం విశేషం. మార్చి నెల గణాంకాలను పరిశీలిస్తే, రష్యా ముడి చమురు ఎగుమతుల్లో సగానికి పైగా, అంటే 51 శాతాన్ని చైనా కొనుగోలు చేసింది. ఆ తర్వాత భారత్ 38 శాతం, తుర్కియే 6 శాతం, యూరోపియన్ యూనియన్ 1.8 శాతం వాటాలను తీసుకున్నాయి.

**నిషేధం ఉన్నా, పరోక్ష మార్గాల్లో**

రష్యా ముడి చమురుతో తయారైన ఇంధన ఉత్పత్తులపై యూరోపియన్ యూనియన్ నిషేధం విధించినప్పటికీ, ఆ ఇంధనం పరోక్ష మార్గాల్లో యూరప్, అమెరికాలకు చేరుతూనే ఉంది. రష్యా చమురును శుద్ధి చేసే రిఫైనరీల నుంచి వచ్చిన 14 ఇంధన నౌకలు మార్చిలో యూరప్ పోర్టుల్లో అన్‌లోడ్ అయ్యాయి. ఇందులో భారత్ నుంచి 4, తుర్కియే నుంచి 9 నౌకలు ఉన్నాయి. ముఖ్యంగా మార్చి నెలలో రష్యన్ క్రూడ్‌ను ప్రాసెస్ చేసే భారత్, తుర్కియే, బ్రూనై తదితర దేశాల రిఫైనరీలు సుమారు 830 మిలియన్ యూరోల ఇంధన ఉత్పత్తులను పశ్చిమ దేశాలకు ఎగుమతి చేశాయి. ఇందులో 304 మిలియన్ యూరోల ఇంధనం ఈయూకి, 168 మిలియన్ యూరోల ఇంధనం అమెరికాకు ఎగుమతి అయ్యింది. అమెరికాకు వెళ్లిన ఈ ఇంధన ఉత్పత్తులు భారతదేశంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీతో పాటు తుర్కియేలోని స్టార్ రిఫైనరీల నుంచే వెళ్లాయని సీఆర్ఈఏ నివేదిక స్పష్టం చేసింది.

# డాలర్‌పై రూపాయి పట్టు.. ఆర్బీఐ కీలక నిర్ణయంతో బలోపేతం

**డాలర్‌తో పోలిస్తే 25 పైసలు బలపడిన రూపాయి**

**చమురు సంస్థలకు ఆర్బీఐ ప్రత్యేక ఆదేశాల జారీ**

**అంతర్జాతీయంగా తగ్గిన ముడి చమురు ధరలు**

**బంగారం, వెండి ధరల్లో కొనసాగుతున్న ఒడుదొడుకులు**

**సానుకూలంగా స్పందించిన దేశీయ స్టాక్ మార్కెట్లు**



అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ ఇవాళ్టి ట్రేడింగ్‌లో బలపడింది. ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇచ్చిన ఓ కీలక ఆదేశం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. డాలర్లను నేరుగా కొనుగోలు చేయడానికి బదులుగా ప్రత్యేక క్రెడిట్ లైన్‌ను ఉపయోగించుకోవాలని ఆర్బీఐ సూచించడంతో డాలర్లకు డిమాండ్ తగ్గి రూపాయిపై ఒత్తిడి తగ్గింది.గత సెషన్‌లో 93.20 వద్ద ముగిసిన రూపాయి, ఈరోజు ఉదయం ట్రేడింగ్‌లో 25 పైసలు లాభపడి 92.95 వద్ద కొనసాగుతోంది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్, ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ వార్తలు, అమెరికా-ఇరాన్ చర్చలలో పురోగతి అంచనాలు కూడా రూపాయికి మద్దతునిచ్చాయి. అయితే, ప్రపంచ మార్కెట్లలో డాలర్ బలంగా ఉండటం రూపాయి లాభాలను కొంతమేర పరిమితం చేస్తోంది.మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 1% పైగా తగ్గి 97.99 డాలర్ల వద్ద, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ దాదాపు 2% తగ్గి 92.91 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. ఇక బంగారం, వెండి ధరలు ఇవాళ ఒడుదొడుకులకు లోనయ్యాయి. జూన్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ స్వల్పంగా రూ.98 పెరిగి రూ.1,53,250 వద్ద ట్రేడవ్వగా, మే 5 సిల్వర్ ఫ్యూచర్స్ 0.83% లాభపడి రూ.2,50,716 గరిష్ఠాన్ని తాకింది.

# "హోమ్ లోన్" ఎక్కువగా రావాలంటే

**ఈ "సీక్రెట్స్" తెలుసుకోవాల్సిందే!**

**ఎక్కువ మొత్తంలో "హోమ్ లోన్" కావాలా**

**ఈ టిప్స్‌తో మీ పని ఈజీ అవుతుందంటున్న నిపుణులు!**



ఇటీవల కాలంలో చాలా మందిలో సొంతింటి ఆలోచన పెరిగింది. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఎంతో శ్రమిస్తుంటారు. అయితే, ఇంటి పనిలోకి దిగాక ఖర్చు అంచనా వేసిన దానికంటే ఎక్కువగా అవుతుంటుంది. అప్పుడు చాలా మందికి ముందుగా గుర్తొచ్చేవి "హోమ్ లోన్స్". ఇందుకు తగ్గట్టే బ్యాంకులు, హోమ్ లోన్ కంపెనీలు రుణాలు ఇస్తుంటాయి. అయితే, మీరు తీసుకునే హోమ్ లోన్ అవసరమైనంత రావాలంటే ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే లోన్ మొత్తం పెరుగుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం.కొత్తగా ఇల్లు కట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నవారు కొన్ని టిప్స్‌తో కావాల్సినంత హోమ్ లోన్ పొందవచ్చంటున్నారు ఆర్థిక నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం.

**క్రెడిట్ స్కోర్ 750+ ఉంటే :**

ప్రస్తుతం మీరు ఎలాంటి లోన్స్ తీసుకోవాలన్నా క్రెడిట్ స్కోర్ అనేది కీలకంగా మారింది. ముఖ్యంగా లోన్ల విషయంలో బ్యాంకులు లేదా హోమ్ లోన్ సంస్థలు ముందుగా క్రెడిట్ స్కోర్ చూస్తాయి. దీనితో మీ క్రెడిట్ హిస్టరీ, మీ ఆర్థిక అలవాట్లను పరిశీలిస్తాయి. అప్పుడు మీ క్రెడిట్ స్కోర్ 750+ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే మీకు కావాల్సినంత హోమ్ లోన్ ఈజీగా వస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, వడ్డీ రేటు కూడా తగ్గే ఛాన్స్ ఉంటుంది. మీ క్రెడిట్ స్కోర్ 800 దాటితే వడ్డీలో 0.5 శాతం వరకు తగ్గింపు కూడా లభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న రుణాలకు సంబంధించిన ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు సకాలంలో చెల్లించడం ద్వారా మంచి క్రెడిట్ స్కోర్ సాధించవచ్చంటున్నారు.

**జాయింట్ లోన్ :**

మీ కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తుంటే జాయింట్ లోన్ తీసుకోవచ్చు. దీని వల్ల ఎక్కువ మొత్తంలో లోన్ దక్కుతుంది. ఈ లోన్ మీ జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు ఎవరితోనైనా కలిసి తీసుకోవచ్చు. ఇలా జాయింట్ లోన్ తీసుకోవడం వల్ల హోమ్ లోన్ త్వరగా రావడమే కాదు ఈఎంఐ భారం కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు. అలాగే, ఇద్దరికి ఆదాయపు పన్ను మినహాయింపు కూడా లభిస్తుందని చెబుతున్నారు.

**ఎక్కువ వ్యవధి ఉండేలా :**

మీకు పెద్ద మొత్తంలో లోన్ కావాల్సినప్పుడు తిరిగి చెల్లించే వ్యవధిని కూడా వీలైనంత ఎక్కువకాలం ఉండేలా చూసుకోవాలంటున్నారు. దీని వల్ల ఈఎంఐ భారం తగ్గి లోన్ మొత్తం పెరుగుతుందని సూచిస్తున్నారు. అయితే, ఇలాంటి టైమ్‌లో వడ్డీ మాత్రం కాస్త అధికంగానే ఉంటుందని గుర్తుంచుకోవాలి.హోమ్ లోన్ ఎక్కువ మొత్తంలో రావాలంటే మీకు ఉన్న ఇతర అప్పులను క్లియర్ చేసుకోవడం బెటర్. ఇప్పటికే ఉన్న ఈఎంఐలు కొత్త లోన్‌కు అడ్డంకిగా మారే అవకాశం ఉంటుంది. ఇంకా క్లియర్‌గా చెప్పాలంటే ఆదాయంలో 40 శాతానికి మించి జువీ×లు లేకుండా చూసుకోవాలి. మరీ తప్పనిసరి అయితే 50 శాతం వరకు ఈఎంఐలు ఉండొచ్చు.

**ఇతర ఆదాయ మార్గాలు :**

మీకు జీతంతోపాటు ఇతర ఆదాయ మార్గాలు ఉంటే వాటిని కూడా బ్యాంకుకు తెలియజేయాలి. అంటే ఉదాహరణకు ఇంటి రెంట్లు, బిజినెస్, వ్యవసాయం, వడ్డీలు ఇలా అన్ని రకాల ఆదాయ మార్గాలను లోన్ అప్లికేషన్‌లో పేర్కొనాలి. ఇవి కూడా మీరు లోన్ మొత్తం పెంచుకునేందుకు చాలా బాగా ఉపయోగపడతాయంటున్నారు ఆర్థిక నిపుణులు.చివరగా.. హోమ్ లోన్ అనేది సుదీర్ఘకాలం కొనసాగుతుంది. ఇది రుణగ్రహీత ఆర్థిక భవిష్యత్తును, ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి, హోమ్ లోన్ తీసుకునేవారు ఒకటికి రెండు సార్లు ఆలోచించి అవసరమైనంత మేరకే లోన్ తీసుకోవడం బెటర్ అంటున్నారు. అలాగే, పత్రాల విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకులు లోన్ మంజూరు కోసం అనేక పత్రాలపై సంతకం తీసుకుంటాయి. అందుకే, సంతకం చేసే ముందు అన్ని పత్రాలను వివరంగా చదవాలి. నియమ నిబంధనలలో ఉన్న చిన్న పాయింటు కూడా భవిష్యత్తులో మీకు ఇబ్బంది కలిగించవచ్చనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు.

# బీబీసీలో ఉద్యోగాల కోత.. 2000 మందిపై వేటుకు రంగం సిద్ధం

**15 ఏళ్లలో ఇదే అతిపెద్ద లేఆఫ్స్**

**ఖర్చుల తగ్గింపు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం**

**ఓటీటీల నుంచి పోటీ, తగ్గుతున్న ఆదాయం ప్రధాన కారణం**




ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ఖర్చులను తగ్గించుకునే ప్రణాళికలో భాగంగా దాదాపు 2,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. గత 15 ఏళ్లలో బీబీసీలో ఇదే అతిపెద్ద లేఆఫ్స్ కావడం గమనార్హం. సంస్థ మొత్తం 21,500 మంది సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది.బుధవారం జరిగిన ఆల్-స్టాఫ్ మీటింగ్‌లో ఉద్యోగులకు ఈ విషయం తెలిపారు. వచ్చే నెలలో మాట్ బ్రిట్టిన్ కొత్త డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో ఈ భారీ తొలగింపులు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 600 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.7,535 కోట్లు) ఆదా ప్రణాళికలో భాగంగా ఈ ఉద్యోగాల కోతను ప్రకటించారు. మారుతున్న మీడియా రంగానికి అనుగుణంగా సంస్థను పునర్వ్యవస్థీకరించడమే లక్ష్యమని బీబీసీ పేర్కొంది.ప్రస్తుతం బీబీసీ తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. లైసెన్స్ ఫీజు ద్వారా ప్రధానంగా ఆదాయం పొందుతున్న బీబీసీకి.. నెట్‌ఫ్లిక్స్, డిస్నీ వంటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. దీనికి తోడు, లైసెన్స్ ఫీజు చెల్లించే వారి సంఖ్య కూడా గత ఏడాదితో పోలిస్తే సుమారు 3 లక్షలు తగ్గింది. వీక్షకుల అభిరుచులు మారడం కూడా సంస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ఈ స్థాయిలో ఉద్యోగాలను తొలగించడం వల్ల సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి పడుతుందని, ఇది సంస్థ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై బీబీసీ కవరేజీపై విమర్శలు రావడంతో గత డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ ఇటీవలే తన పదవి నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం తాత్కాలిక డైరెక్టర్ జనరల్ పర్యవేక్షణలో కార్యకలాపాలు సాగుతున్నాయి.

# 40లోకి ఎంట్రీ ఇచ్చారా

**ఇలా ప్లాన్ చేస్తే వృద్ధాప్యంలో 'నో' ఫైనాన్షియల్ టెన్షన్స్!**

**ఇప్పటి వరకూ ఒక లెక్క.. ఇప్పటి నుంచీ మరో లెక్క**

**మీ "ఆర్థిక ప్రణాళిక" ఇలా సెట్ చేసుకోండి!**



ఎవరమైనా యుక్త వయసులో ఉన్నప్పుడు ఆరోగ్యంగా, బలంగా ఉంటాం. ఎవరి మీద ఆధారపడకుండా ఉద్యోగం, రోజువారీ పనులు చురుగ్గా చేసుకుంటుంటాం. అలాగే, జాబ్ చేసేవారికి టైమ్‌కు జీతం రావడం, ఉద్యోగం లేని వారికి వాళ్లు చేసే పనుల ద్వారా డబ్బు అందుతుంది. దాంతో రోజువారీ జీవనం ఆర్థిక ఇబ్బందుల్లేకుండా హ్యాపీగా గడిచిపోతుంది. కానీ, వయసు పెరిగేకొద్దీ ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా సమస్యలు వచ్చిపడుతుంటాయి.ఈ నేపథ్యంలో వృద్ధాప్యంలో ఎలాంటి ఫైనాన్షియల్ టెన్షన్స్ లేకుండా జీవనం సాగించాలంటే 40 ఏళ్లు దాటిన వారు ఇప్పటి నుంచే ఆర్థికంగా కొన్ని ప్రణాళికలు సెట్ చేసుకోవాలంటున్నారు నిపుణులు. మరి, 40 ఏళ్ల వారి ఆర్థిక ప్రణాళిక ఎలా ఉంటే మంచిదో ఇప్పుడు చూద్దాం.

**ఖర్చులు తగ్గించడం..**

జీవితంలో నడి వయసుకు వచ్చాక స్థిరమైన ఆర్థిక భవిష్యత్తు కోసం మీకంటూ ఒక స్పష్టతను ఏర్పరుచుకోవాలి. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన తర్వాత ఖర్చులను నియంత్రణలోకి తీసుకురావడం చాలా కీలకమంటున్నారు నిపుణులు. మీ ఆదాయం, ఖర్చులను బట్టి బడ్జెట్‌ను రూపొందించుకోవాలి. అనవసరమైన వాటికోసం డబ్బులు ఖర్చుపెట్టకూడదు. పొదుపు ఆలోచన పెంచుకోవాలి. అప్పుడే భవిష్యత్తుపై దృష్టి పెట్టేందుకు వీలవుతుందంటున్నారు.

**పొదుపు స్టార్ట్ చేయడం..**

మీరు ఎంతో కష్టపడి డబ్బు సంపాదిస్తుంటారు. మరి, ఆ డబ్బును ఆదా చేయడంతో పాటు సరైన స్కీమ్స్‌లో ఇన్వెస్ట్ చేసినప్పుడే మెరుగైన ఆర్థిక వృద్ధిని సాధించగలరని సూచిస్తున్నారు నిపుణులు. స్టాక్ మార్కెట్స్, ఇతర వాటిల్లో డబ్బును పెట్టుబడి పెట్టేటప్పుడు మీ నష్టభయ సామర్థ్యాన్ని అంచనా వేసుకుని నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా మీ ఆర్థిక సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని తక్కువ నష్టభయం ఉండే స్కీమ్స్‌లో కొంతమేర ఇన్వెస్ట్ చేయడం బెటర్. అందులోనూ దీర్ఘకాలంలో మంచి రాబడిని అందించే వాటిల్లో పెట్టుబడులు పెట్టడం ప్రయోజనకరంగా ఉంటుందంటున్నారు.

**పిల్లల అవసరాలు తీర్చేలా..**

నలభై ఏళ్ల వయస్సులో పిల్లల భవిష్యత్తు కోసం ఆర్థిక ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వారి చదువులు, పెళ్లికి సంబంధించిన ఖర్చులన్నీ లెక్క వేసుకోవాలి. వాటన్నింటికీ అవసరమైనప్పుడు, సరిపోయేంత నిధిని కూడబెట్టాలి. అలాగే, ఊహించని ఖర్చులకూ రెడీగా ఉండాలి. ప్రస్తుతం పిల్లలు భవిష్యత్తు రక్షణ కోసం ప్రత్యేకమైన ఇన్సూరెన్స్ ప్లాన్స్, మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని ఒకసారి పరిశీలించి తగినది ఎంచుకోవడం మంచిది.

**జీవిత బీమా తీసుకోవడం..**

కొన్నిసార్లు అనుకోకుండా జరిగే సంఘటనలు కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెడతాయి. దీన్ని నివారించేందుకు మీ పేరు మీద(సంపాదించే వ్యక్తి పేరు మీద) కచ్చితంగా బీమా పాలసీ తీసుకోవాలి. ఎందుకంటే, కుటుంబ పెద్ద లేని దురదృష్టకర సందర్భంలో ఆ జీవత బీమా పాలసీ కుటుంబానికి ఆర్థిక భరోసానిస్తుంది. అప్పులు తీర్చడం, పిల్లల చదువులు ఆగిపోకుండా సహాయపడుతుంది. అందుకే, వార్షికాదాయానికి కనీసం 12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ ఉండేలా చూసుకోవడం అవసరమంటున్నారు నిపుణులు.

**ఆరోగ్య బీమాతో..**

మారిన జీవనశైలి కారణంగా రోజురోజుకు కొత్త కొత్త జబ్బులు పుట్టుకొస్తున్నాయి. దాంతో వైద్య ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మీ ఆర్థిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఒక ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం చాలా అవసరమంటున్నారు. సంస్థ అందించే బృంద బీమా ఉన్నప్పటికీ సొంతంగా ఒక పాలసీ తీసుకోవడం బెటర్. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఫ్యామిలీ అంతటికీ కలిసి రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా, దీనిపై మరో రూ.20 లక్షల వరకూ సూపర్ టాపప్ ఉండేవి ఎంచుకోవడం మంచిదంటున్నారు.

**విశ్రాంత జీవితంలో..**

మీకు 40 ఏళ్లు వచ్చి ఉంటే పదవీ విరమణకు ఇంకా 18-20 ఏళ్ల సమయం ఉంటుంది. కాబట్టి, అందుకోసం ఇప్పటినుంచే ఒక మంచి దీర్ఘకాలిక ప్రణాళికతో సిద్ధం కావాలి. వృద్ధాప్య జీవితం ప్రశాంతంగా సాగించేందుకు ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా ప్రత్యేకంగా పెట్టుబడులు స్టార్ట్ చేయాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మీ పొదుపు, పెట్టుబడుల వ్యూహాన్ని రచించుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందుల్లేకుండా హ్యాపీగా జీవనం సాగించేయొచ్చంటున్నారు నిపుణులు

# టీసీఎస్ కేసులో బిగ్ ట్విస్ట్.. గర్భవతినంటూ ముందస్తు బెయిల్‌కు వెళ్లిన సూత్రధారి నిదా ఖాన్!

**టీసీఎస్ నాసిక్ కేసులో పరారీలో ఉన్న నిదా ఖాన్**

**అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ముందస్తు బెయిల్ పిటిషన్**

**కేసులో ఈమెను మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న పోలీసులు**

**ఇప్పటికే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన సిట్**

**నేడు పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ యూనిట్‌లోని బలవంతపు మత మార్పిడి, లైంగిక వేధింపుల కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటూ, పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉన్న హెచ్ఆర్ మేనేజర్ నిదా ఖాన్ అరెస్ట్ భయంతో నాసిక్ జిల్లా కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తాను గర్భవతినని, మానవతా దృక్పథంతో తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని ఆమె తన పిటిషన్‌లో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ కేసులో నిదా ఖాన్ పాత్ర అత్యంత కీలకమని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) భావిస్తోంది. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు వారిని బెదిరించడం, నిందితులైన సీనియర్లకు కొమ్ము కాయడంలో ఆమెదే ప్రధాన పాత్ర అని ఆరోపణలున్నాయి. సిట్ బృందాలు ఆమె కోసం ముంబై, ఇతర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలిస్తుండగానే, ఆమె న్యాయవాదుల ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం.

**గర్భమే కీలక అస్త్రమా?**

ముందస్తు బెయిల్ కోసం నిదా ఖాన్ తన గర్భాన్ని ప్రధాన కారణంగా చూపడం ఈ కేసులో వ్యూహాత్మక ఎత్తుగడగా కనిపిస్తోంది. సాధారణంగా మహిళలు, అందులోనూ గర్భవతులు నిందితులుగా ఉన్నప్పుడు న్యాయస్థానాలు కాస్త సానుభూతితో వ్యవహరించే అవకాశం ఉంటుంది. అయితే, కేసు తీవ్రత, ఆమెపై ఉన్న ఆరోపణల దృష్ట్యా కోర్టు ఎలా స్పందిస్తుందనేది ఉత్కంఠగా మారింది. పోలీసులు ఆమెను 'మాస్టర్‌మైండ్'గా పరిగణిస్తున్న నేపథ్యంలో, కేవలం గర్భం అనే కారణంతో ఆమెకు ఉపశమనం లభిస్తుందా? లేదా? అనేది వేచి చూడాలి. ఈ పిటిషన్‌పై కోర్టు శుక్రవారం విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కేసు నేపథ్యం ఇదీ..**

టీసీఎస్ నాసిక్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న కొందరు సీనియర్లు, జూనియర్ మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించారని, హిందూ దేవుళ్లను కించపరుస్తూ మాట్లాడారని, బలవంతంగా బురఖా ధరించి నమాజ్ చేయాలంటూ ఒత్తిడి తెచ్చారని పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలపై మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, కేసు దర్యాప్తును సిట్ స్వీకరించింది. ఇప్పటివరకు ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులందరినీ టీసీఎస్ ఇప్పటికే సస్పెండ్ చేసింది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఆదేశాలతో కంపెనీ అంతర్గత విచారణ కూడా వేగంగా కొనసాగుతోంది. ఒకవైపు పోలీసుల గాలింపు, మరోవైపు న్యాయపోరాటంతో ఈ కేసు రోజురోజుకు మరింత ఉత్కంఠను రేపుతోంది.

# అయ్యప్ప భక్తుల మధ్యలో పోలీస్ ఆఫీసర్..

## ఆకట్టుకుంటున్న మోహన్ లాల్ కొత్త సినిమా లుక్!

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ వరుస ప్రయోగాలతో బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తున్నారు. గతేడాది 'తుడరుమ్' చిత్రంలో ట్యాక్సీ డ్రైవర్‌గా, 'హృదయపూర్వం'లో ప్రేమికుడిగా వైవిధ్యమైన నటనతో మెప్పించిన ఆయన, ఇప్పుడు ఖాకీ చొక్కా ధరించి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తరుణ్ మూర్తి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రానికి 'అతిమనోహరం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 'తుడరుమ్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మలయాళీల నుతన సంవత్సర పండుగ అయిన 'విషు' రోజున ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన చేసింది. ఈ పోస్టర్‌లో శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వామి భక్తుల మధ్య మోహన్ లాల్ పోలీస్ యూనిఫాంలో గంభీరంగా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఇందులో ఆయన 'లవ్ లాజన్' అనే విభిన్నమైన పాత్రను పోషిస్తుండటం విశేషం. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాతో పాటు మోహన్ లాల్ చేతిలో 'పేట్రియాట్', అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'దృశ్యం 3' వంటి క్రేజీ ప్రాజెక్టులు కూడా ఉండటంతో మాలీవుడ్ వర్గాల్లో సందడి నెలకొంది.




# అక్కినేని హీరో క్రేజీ అప్‌డేట్స్

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. 2025లో 'తండేల్' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న చైతు, ఇప్పుడు అదే ఉత్సాహంతో వరుస ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తున్నారు. తాజాగా, ఆయన తన రాబోయే చిత్రాల గురించి ఆసక్తికరమైన అప్‌డేట్స్ పంచుకున్నారు. మ్యాజికల్ థ్రిల్లర్ 'విరూపాక్ష'తో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య 'వృషకర్మ' అనే భారీ బడ్జెట్ చిత్రంలో నటిస్తున్నారు. ాంఎఅఅ బ్యానర్‌పై భోగవల్లి బాపినీడు నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఓ ఇంటర్వ్యూలో చైతు మాట్లాడుతూ.. "వృషకర్మ షూటింగ్ ఇప్పటికే 85 శాతం పూర్తయింది. కేవలం 15 శాతం మాత్రమే మిగిలి ఉంది. ఈ సినిమా కథ చాలా కొత్తగా, వినూత్నంగా ఉంటుంది" అని తెలిపారు. ఇందులో చైతు సరసన అందాల భామ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. చైతన్య తన ఓటీటీ అరంగేట్రం చేసిన 'ధూత' వెబ్ సిరీస్ ఎంతటి విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆ సూపర్ హిట్ సిరీస్‌కు సీక్వెల్ ధూత-2 రాబోతోంది. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలోనే తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్ గురించి చైతు క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సిరీస్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. వరుస సక్సెస్‌లతో జోరు మీదున్న చైతన్య, అటు వెండితెరపై 'వృషకర్మ'తో, ఇటు ఓటీటీలో 'ధూత-2'తో ప్రేక్షకులను మరోసారి థ్రిల్ చేయడానికి సిద్ధమవుతున్నారు. విలక్షణమైన కథలను ఎంచుకుంటూ చైతు సాగిస్తున్న ఈ ప్రయాణం అక్కినేని అభిమానులకు ఫుల్ జోష్ ఇస్తోంది.



# బ్లాక్‌బస్టర్ సినిమా ఫ్రాంచైజీలో అశోక్ గల్లా

ఫ్రెండ్‌షిప్ బ్యాక్‌డ్రాప్‌లో 2018లో విడుదలైన చిత్రం హుషారు.. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్ రానుంది. నలుగురు స్నేహితులు కలిసి చేసే సాహసాలు ఎలా ఉంటాయి దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి ఫన్నీగా చూపిస్తూ యూత్‌కు కనెక్ట్ అయ్యే ప్రేమ కథను చూపించాడు. ఇందులో తేజస్, దక్ష, అభినవ్, ప్రియా వంటి వారు నటించారు. అయితే, తాజాగా రానున్న పార్ట్-2లో అశోక్ గల్లా నటించనున్నారని తెలుస్తోంది. 'హీరో' సినిమాతో వెండితెరకు పరిచయమైన అశోక్ గల్లా.. మొదటి సినిమాతో ప్రేక్షకులను మెప్పించాడు. ఆ తర్వాత 'దేవకీ నందన వాసుదేవ' చిత్రంతో అలరించాడు. అయితే, ఇప్పుడు హుషారు-2 చిత్రంలో భాగం కానున్నాడని వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ ప్రాజెక్ట్‌కు కూడా శ్రీహర్ష కొనుగంటినే దర్శకత్వం వహించనున్నారు. ఈ వార్త నిజమైతే, అశోక్ గల్లా కెరీర్‌లో ఒక ముఖ్యమైన మలుపు అవుతుంది. అశోక్ గల్లా తన తొలి చిత్రం 'హీరో'తో ఆకట్టుకున్నారు. బాక్సాఫీస్ వద్ద హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు ఈ ప్రాజెక్ట్ సరిగ్గా సెట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు, మహేశ్ బాబుకు మేనల్లుడిగా సినీ ఇండస్ట్రీలోకి అశోక్ ఎంట్రీ ఇచ్చారు. అయితే, మొదటి సినిమా హీరోతోనే ప్రేక్షకులను మెప్పించాడు. ఇప్పుడు హుషారు-2తో తన జోరు చూపేంచే ప్లాన్‌లో ఉన్నాడు.





# నిఖిల్ 'స్వయంభూ' నుంచి మొదటి పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ' ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.

# అఖిల్ లెనిన్.. ఎట్టా ఎట్టా సాంగ్ రిలీజ్

అక్కినేని హీరో అఖిల్ నటిస్తోన్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ నెల 8న అఖిల్ పుట్టినరోజు సందర్భంగా 'లెనిన్' నుంచి కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఎట్టా ఎట్టా అంటూ సాగే లిరికల్ వీడియో పాటను విడుదల చేశారు. ఈ పాటకు భాస్కరభట్ల లిరిక్స్ అందించగా.. శ్రీకృష్ణ ఆలపించారు. ఈ సాంగ్ ఎస్ఎస్ తమన్ కంపోజ్ చేశారు. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించారు. ఇప్పటికే రిలీజైన ఓ సాంగ్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.